

ఆమె బోధన వినూత్నం



- పిల్లలను ఆకట్టుకునే రీతిలో పాఠాలు
- వీడియోలు, చార్టుల రూపకల్పన
- సామాజిక మాధ్యమాల్లో లక్షల మంది వీక్షకులు
- పినగాడి ప్రాథమిక పాఠశాల ఎస్జీటీకి మంత్రి లోకేశ్ అభినందన

-8లో

ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లు 91.62% పంపిణీ

అనకాపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం కింద మొదటి రోజైన సోమవారం 91.62 శాతం మందికి డబ్బులు పంపిణీ చేశారు. జిల్లాలో మొత్తం 2,56,338 మంది పింఛన్‌దారులు వుండగా, సోమవారం సాయంత్రం ఆరు గంటల వరకు 2,34,866 మందికి నగదు పంపిణీ చేసినట్టు డీఆర్‌డీఏ పీడీ శచీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. డోర్‌లాక్, వలస వెళ్లిన పింఛన్‌దారులకు రెండు, మూడు రోజుల్లో డబ్బులు పంపిణీ చేస్తామన్నారు. కాగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు నర్సీపట్నం మండలం అమలాపురంలో పలువురు లబ్ధిదారులకు పింఛన్ డబ్బులు అందించారు. కలెక్టర్ విజయకృష్ణన్ పరవాడ మండలం కన్నూరులో, చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు రావికమతం మండలం కొత్తకోటలో, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కె.కోటపాడు మండలం సూర్రెడ్డిపాలెంలో పింఛన్ డబ్బులు పంపిణీ చేశారు.



నర్సీపట్నం మండలం అమలాపురంలో వృద్ధురాలికి పింఛన్ డబ్బులు అందజేస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

టెన్త్, ఇంటర్‌లో శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం

- హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లతో సమావేశం

కొత్తూరు, డిసెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికను రూపొందించుకుని అమలు చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. సోమవారం స్థానిక ఏఎంఏఎ హైస్కూలులో జిల్లాలోని ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ నెల 5వ తేదీన జరగనున్న మెగా పేరెంట్ మీట్‌ను అన్ని పాఠశాలల్లో పండుగ వాతావరణంలో జరిగేటట్టు చూడాలన్నారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డీఈవో గిడ్డి అప్పారావునాయుడు, ఆర్ఐవో వినోద్‌బాబు, డిప్యూటీ డీఈవో పొన్నాడ అప్పారావు, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూలు కో-ఆర్డినేటర్ మేరీగ్రేస్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మంగవేణి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అన్నదాత వర్రీ

తుఫాన్ ప్రభావంతో ముసురు వాతావరణం

- పలుచోట్ల మోస్తరు వర్షం, తడిసిన వరి పనలు
- రెండు రోజులపాటు వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికలతో రైతులు ఆందోళన
- చేతికందాల్సిన పంట నీటిపాలవుతుందని బెంగ
- వరి కోతలు వాయిదా వేసుకోవాలని వ్యవసాయ అధికారుల సూచన



రావికమతం మండలం మత్స్యపురంలో వర్షానికి తడిసిన వరి పనలు

అనకాపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి- న్యూస్‌నెట్‌వర్క్):

నైరుతి బంగాళాఖాతంలో నెలకొన్న 'దిత్వా' తుఫాన్ తీవ్ర వాయుగుండంగా బలహీనపడినప్పటికీ, రానున్న రెండు రోజులు వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ సమాచారంతో వరి రైతులు ఆందోళన చెందుతున్నారు.

ముఖ్యంగా ఈ వారంలో పంట కోయాలనుకున్న వారితోపాటు గత రెండు, మూడు రోజుల్లో వరి కోతలు పూర్తయి, కుప్పలు వేయని రైతులు దిగాలు పడుతున్నారు. కాగా ఆదివారం రాత్రి, సోమవారం పగలు జిల్లాలోని పలు మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి. అక్కడక్కడా మోస్తరు వర్షం కురిసింది. దీంతో కుప్పలు వేయని పొలాల్లో వరి పనలు తడిసిపోయాయి. తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిస్తే తీవ్రంగా నష్టపోతాయని వాపోతున్నారు.

వ్యవసాయ శాఖ గణాంకాల ప్రకారం జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 54,465 హెక్టార్లలో వరి సాగు చేశారు. ఇంతవరకు 4,632 హెక్టార్లలో వరి కోతలు పూర్తయ్యాయి. మిగిలిన చోట్ల గింజ గట్టిపడడం లేదా కోత దశకు చేరాయి. ఇటువంటి తరుణంలో బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాన్ కారణంగా ఆదివారం రాత్రి నుంచే జిల్లాలో వాతావరణం మారిపోయింది. అనకాపల్లి, చోడవరం, కశింకోట, మునగపాక, బుచ్చెయ్యపేట మండలాల్లో తేలిక పాటి జల్లులు పడ్డాయి. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ముసురు వాతావరణం నెలకొంది. సబ్బవరం, రావికమతం, దేవరాపల్లి, నక్కపల్లి, పాయకరావుపేట, కె.కోటపాడు, ఎలమంచిలి, చోడవరం, బుచ్చెయ్యపేట, మాడుగుల, చీడికాడ, గొలుగొండ మండలాల్లో ఆకాశంలో మబ్బులు కమ్ముకొని తేలికపాటి జల్లులు కురిశాయి. నర్సీపట్నం, గొలుగొండ, మాకవరపాలెం, ... మిగతా 8వ పేజీలో



అనకాపల్లి మండలం శంకరంలో కుప్పలు వేయని వరి పనలు

వరి కోతలు వాయిదా వేసుకోవాలి

- వ్యవసాయ శాఖ నర్సీపట్నం ఏడీ శ్రీదేవి

రావికమతం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా రాగల రెండు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం వున్నందున రైతులు వరి కోతలను వాయిదా వేసుకోవాలని వ్యవసాయ శాఖ నర్సీపట్నం డివిజన్ ఏడీ శ్రీదేవి సూచించారు. ఆమె సోమవారం కొండెంపూడి కేవీకే ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ ఎస్.రాజ్‌కుమార్, మరో శాస్త్రవేత్త సౌజన్యతో కలసి మండలంలోని కొమిర, చినపాచిల, మత్స్యపురం, రావికమతం గ్రామాల్లో వరి పొలాలను పరిశీలించారు. ఇప్పటికే వరి కోతలు పూర్తి చేసి, కుప్పలు వేయని రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదని అన్నారు. వర్షానికి వరి పనలు తడిస్తే.. లీటరు నీటికి వంద గ్రాముల చొప్పున ఉప్పు కలిపి, వరి పనలపై పిచికారీచేయాలని, దీనివల్ల ధాన్యం మొలకెత్తకుండా, రంగు మారకుండా వుంటుందని చెప్పారు. వరి పనలు నీట మునగకుండా మెరక ప్రదేశానికి చేర్చుకోవాలని సూచించారు.



రావికమతం మండలం కొమిరలో వరి పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న అధికారులు, శాస్త్రవేత్తలు

గంజాయి కేసులో నలుగురికి జైలుశిక్ష

- రూ.లక్ష చొప్పున జరిమానా

చోడవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణా కేసులో నలుగురు ముద్దాయిలకు పదేళ్లపాటు కారాగార శిక్ష, రూ.లక్ష చొప్పున జరిమానా విధిస్తూ స్థానిక 9వ అదనపు జిల్లా జడ్జి ఎం.హరినారాయణ సోమవారం తీర్పు ఇచ్చారు. ఇందుకు సంబంధించి వివరాలిలా వున్నాయి. 2015వ సంవత్సరం మార్చి 31వ తేదీన చీడికాడ అప్పటి ఎస్ఐ బి.డి.విశ్వనాథం, పోలీసు సిబ్బందితో ఏ.అగ్రహారం సమీపంలో వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ సమయంలో వచ్చిన ఇన్నోవా కారును ఆపి సోదాలు చేశారు. గోనె సంచుల్లో రవాణా చేస్తున్న 140 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి ఉమ్మడి వరంగల్ జిల్లా చినవంగర గ్రామానికి చెందిన ధరావత్ రవి, అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం కె.నాయుడుపాలేనికి చెందిన మడ్డు నరసింహరాజు, చీడికాడ మండలం అడవుల అగ్రహారానికి చెందిన దాలిబోయిన ఫాల్గుణ, నర్సీపట్నం ద్వారకానగర్‌కు చెందిన బండారు సంతోశ్‌లను అరెస్టు చేశారు. కేసు దర్యాప్తు అనంతరం కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.చంద్రశేఖర్ కేసును సమర్థంగా వాదించారు. దీంతో పోలీసులు మోపిన అభియోగం రుజువు కావడంతో ముద్దాయిలకు పదేళ్ల కఠిన కారాగారశిక్షతోపాటు లక్ష రూపాయల చొప్పున జరిమానా విధిస్తూ చోడవరం కోర్టు 9వ అదనపు జిల్లా జడ్జి ఎం.హరినారాయణ తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఏడాదిపాటు సాధారణ జైలు శిక్ష అనుభవించాల్సి వుంటుందని పేర్కొన్నారు.

శత శాతం ధ్యేయం

సంపూర్ణ అక్షరాస్యత దిశగా కార్యాచరణ

- 2029 నాటికి సాధించడమే లక్ష్యం
- 2011 జనాభా లెక్కల మేరకు 66.91 శాతం అక్షరాస్యత
- ఉమ్మడి జిల్లాలో మొత్తం నిరక్షరాస్యులు ఆరు లక్షలు
- తొలివిడతలో 2.53 లక్షల మందిని తీర్చిదిద్దాలని కంకణం

విశాఖపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):

దేశంలో ప్రతిఒక్కరూ అక్షరాస్యులు కావాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా 'అక్షర ఆంధ్ర' కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. గత ఆర్థిక సంవత్సరం నుంచి 2026-27 వరకు మూడేళ్లలో నిరక్షరాస్యుల్లో మూడింట ఒక వంతు మందిని అక్షరాస్యులుగా మార్చాలన్నది లక్ష్యం. ఇందులో భాగంగా మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి శిక్షణ కార్యక్రమాలు పూర్తిచేసిన అధికారులు, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో నిరక్షరాస్యులకు చదవడం, రాయడం, కూడికలు, తీసివేతలు నేర్పించేందుకు తరగతులు నిర్వహిస్తున్నారు.

ఉమ్మడి విశాఖ జిల్లాలో 2011 జనాభా లెక్కల మేరకు అక్షరాస్యత 66.91 శాతం (పురుషులు 74.56, మహిళలు 59.34 శాతం)గా నమోదయింది. కొత్త జిల్లాల వారీగా చూస్తే విశాఖ జిల్లాలో పురుషులు, మహిళలు 84.81 శాతం, 73.21 శాతం (మొత్తం 79.05 శాతం), అనకాపల్లిలో 68.90, 52.43 (మొత్తం 60.55 శాతం), అల్లూరి జిల్లాలో 57.60, 39.53 (48.34 శాతం) అక్షరాస్యులున్నారు. ఆ తరువాత కాలంలో అక్షరాస్యత శాతం పెరిగింది. పదేళ్ల క్రితం సంక్షేమ కార్యక్రమాల అమలుకోసం చేపట్టిన సర్వే ప్రకారం ఉమ్మడి జిల్లాలో సుమారు ఆరు లక్షల మంది నిరక్షరాస్యులు ఉంటారని అంచనా వేశారు. ఇందులో తొలివిడతలో మొత్తం 2,53,915 మంది (విశాఖ జిల్లాలో 78,676 మంది, అనకాపల్లిలో 89,944, అల్లూరి జిల్లాలో 85,284)ని అక్షరాస్యులను చేయాలని అధికారులు ప్రతిపాదించారు. ప్రధానంగా ఉపాధి హామీ పథకం కూలీలు, డ్వాక్రా సంఘాల సభ్యులను అక్షరాస్యులను చేయడం ద్వారా ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యత సాధించడంపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టిసారించారు. దీనికి అనుగుణంగా అక్షర ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆడియో, వీడియో పాఠాలతోపాటు రాయడం, చదవడం, చిన్నచిన్న కూడికలు, తీసివేతలు నేర్పిస్తున్నారు. జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా ప్రాథమిక అక్షరాస్యత, సాంఖ్యక శాస్త్రం, జీవ, వృత్తి నైపుణ్యాలు, ప్రాథమిక విద్య, నిరంతర విద్య కార్యక్రమాలు ... మిగతా 8వ పేజీలో



చదువుకుంటున్న వయోజనులు



నిరక్షరాస్యులకు పుస్తకాలు అందిస్తున్న వలంటీరు

నర్సీపట్నం అభివృద్ధికి ఏటా రూ.100 కోట్లు



బాలికల వసతి గృహాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

- తాండవ-నాతవరం రోడ్డుకు రూ.3.5 కోట్లు మంజూరు
- శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నాతవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం నియోజకవర్గంలో ఏటా రూ.100 కోట్లతో అభివృద్ధి పనులు చేయనున్నట్టు శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. మండలంలోని డి.యర్రవరంలో రూ.2 కోట్లతో నిర్మించిన బాలికల వసతిగృహాన్ని, రూ.23 లక్షలతో నిర్మించిన గ్రంథాలయ భవనాన్ని సోమవారం అధికారులతో కలసి ప్రారంభించారు అనంతరం ఏర్పాటు చేసిన సభలో స్పీకర్ మాట్లాడుతూ, అభివృద్ధి విషయంలో నర్సీపట్నం నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. తాండవ-నాతవరం రోడ్డుకు రూ.3.5 కోట్లు మంజూరయ్యాయని, వచ్చే నెలలో పనులు ప్రారంభిస్తారని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో రూ.4 వేలకు తగ్గకుండా పింఛన్ ఇస్తున్నామని ఆయన చెప్పారు. నాతవరం-గొలుగొండ మండలాలను కలిపే రోడ్డుకు తాండవ డ్యామ్ వద్ద రక్షణగోడ ఏర్పాటు చేయిస్తానని ... మిగతా 8వ పేజీలో

నర్సీపట్నానికి సెంట్రల్ స్కూల్

- బలిఘట్టంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు స్థల పరిశీలన

నర్సీపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నర్సీపట్నం అసెంబ్లీ నియోజకవర్గంలో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు కానున్నది. మునిసిపాలిటీ పరిధిలోని బలిఘట్టంలో కేవీ ఏర్పాటుకు స్థల పరిశీలన జరిగింది. వాస్తవంగా అనకాపల్లికి గతంలో కేంద్రీయ విద్యాలయం మంజూరు కాగా.. అక్కడ కేటాయించిన స్థలం వివాదంలో వుండడంతో నర్సీపట్నం తరలిస్తున్నట్టు తెలిసింది. శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదేశాలతో సమగ్ర శిక్ష అదనపు పథక సంచాలకులు ఆర్.జయప్రకాశ్, ఆర్డీవో వీవీ రమణ, తహసీల్దార్ రామారావు, ఏఎంసీ చైర్మన్ రమణ సోమవారం బలిఘట్టంలో భూమిని సోమవారం పరిశీలించారు.



కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

విశాఖకు మణిహారం

- కైలాసగిరిపై గ్లాస్ బ్రిడ్జి ప్రారంభం
- సందర్శకులను అనుమతిస్తున్న అధికారులు

విశాఖపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విశాఖ నగరానికి పర్యాటకంగా మరో మణిహారం అందుబాటులోకి వచ్చింది. కైలాసగిరిపై రూ.7 కోట్లతో నిర్మించిన గ్లాస్ బ్రిడ్జిని సోమవారం ప్రారంభించి సందర్శకులను అనుమతిస్తున్నారు. నాలుగు నెలల క్రితమే నిర్మాణం పూర్తిచేసుకున్న గ్లాస్ బ్రిడ్జిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతులు మీదుగా ప్రారంభించాలని భావించారు. అయితే ప్రతిసారీ కార్యక్రమం వాయిదా పడుతుండడంతో సోమవారం విశాఖ ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్‌తో ప్రారంభింపజేశారు. ఈ సందర్భంగా వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ కైలాసగిరిపై ఇప్పటికే స్కై సైక్లింగ్, పారా గ్లైడింగ్ అందుబాటులోకి వచ్చాయన్నారు. హుద్‌హుద్ వంటి భారీ తుఫాన్లను కూడా తట్టుకొని నిలబడేలా గ్లాస్ బ్రిడ్జి నిర్మించామన్నారు. త్వరలో కైలాసగిరిపై త్రిశూల్, ఢమరుకం నిర్మాణాలు పూర్తిచేస్తామన్నారు. చీకటి పడిన తరువాత నగర ప్రజలకు స్పష్టంగా కనిపించేలా లైటింగ్ ఏర్పాట్లు చేస్తామన్నారు. వీటన్నింటితో విశాఖకు పర్యాటక రంగంలో మరిన్ని పెట్టుబడులు లభిస్తాయని ఆశాభావం వ్యక్తంచేశారు. కైలాసగిరిని అత్యంత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, వీఎంఆర్‌డీఏ కమిషనర్ తేజ్ భరత్, జాయింట్ కమిషనర్ రమేశ్, చీఫ్ ఇంజనీర్ వినయ్‌కుమార్, ఈఈ మధుసూదనరావు, నిర్వాహకులు పాల్గొన్నారు.



గ్లాస్ బ్రిడ్జి ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్, మేయరు పీలా శ్రీనివాసరావు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, కమిషనర్ తేజ్‌భరత్ తదితరులు

విజ్ఞాన యాత్రలతో పిల్లల ఆలోచనల్లో మార్పు



అనకాపల్లి వ్యవసాయ పరిశోధనా కేంద్రం వద్ద నక్కపల్లి హైస్కూల్ విద్యార్థులు

నక్కపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన యాత్రలతో పిల్లల ఆలోచనల్లో మార్పు వస్తుందని నక్కపల్లి హైస్కూల్ హెచ్ఎం పి.విజయ అన్నారు. సోమవారం స్థానిక జడ్పీ హైస్కూల్ విద్యార్థులు అనకాపల్లిలోని ప్రాంతీ వ్యవసాయ పరిశోధనా కేంద్రాన్ని విజ్ఞాన యాత్రలో భాగంగా సందర్శించారు. వ్యవసాయ పరిశోధనా స్థానం పనితీరు, రైతాంగానికి ఈ కేంద్రంతో కలుగుతున్న ప్రయోజనాల గురించి చీఫ్ సైంటిస్ట్ ఉమామహేశ్వరరావు చక్కగా వివరించారని చెప్పారు. ఈ యాత్రలో ఉపాధ్యాయులు టీవీ రమణ, డి. శ్రీనివాసరావు, పి.శ్రీనివాస్, ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు.

'కాలనీలో మౌలిక సౌకర్యాలు కల్పించాలి'

అచ్యుతాపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కొండకర్ల జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని టీడీపీ జిల్లా బీసీసెల్ అధికార ప్రతినిధి కర్రి ఆదిబాబు కోరారు. కొండకర్లలో 200 మంది లబ్ధిదారుల్లో అధిక శాతం మంది ఇళ్లు మంజూరు చేశారన్నారు. గృహాలు నిర్మించుకున్న వారికి రోడ్లు, విద్యుత్ సరఫరా, మంచినీరు వంటి మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కాలనీకి వెళ్లడానికి కనీసం రోడ్డు సౌకర్యం కూడా లేదని, మౌలిక సౌకర్యాలు కల్పించాలని ఆయన కోరారు.

పేదలు, వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

పాయకరావుపేట రూరల్, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి):మండలంలోని పాల్తేరులో సోమవారం పాయకరావుపేట పీఏసీఎస్ ఛైర్పర్సన్ దేవవరపు రాజబాబు పుట్టిన రోజు సందర్భంగా పేదలు, వృద్ధులకు టీడీపీ నాయకులు కొప్పిశెట్టి వెంకటేష్, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టరు పెదిరెడ్డి చిట్టిబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు చించలపు ప్రదీప్ దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం తుని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టరు పల్లా విలియం కేరీ, టీడీపీ పట్టణ అధ్యక్షుడు యాళ్ల వరహాలు, జనసేన నాయకుడు దేవవరపు రఘు, ఎంపీటీసీ సభ్యుడు మాకినీడి చిట్టిబాబు, టీడీపీ నాయకులు జూరెడ్డి ప్రసాద్, కట్టా శ్రీను, ఆది, వేములపూడి అప్పారావు, కొంకిపూడి రామకృష్ణ, అభిమానులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు పరిశీలన

ఎస్.రాయవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినగుమ్ములూరు, పెదగుమ్ములూరు గ్రామాల్లో పారిశుధ్య పనులను సోమవారం ఎంపీడీవో మీనాకుమారి, డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలందరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. అలాగే గెడ్డపాలెం, వమ్మవరం గ్రామాల్లో డిప్యూటీ ఎంపీడీవో పర్యటించి, పారిశుధ్య పనులు, సంపద తయారీ కేంద్రాలను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.

ఇత్తడి తొడుగుకు రూ.40 వేల విరాళం

మునగపాక, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంతబయల రామాలయంలో ద్వారబంధానికి ఇత్తడి తొడుగు నిమిత్తం భక్తుడు శరగడం అప్పలనాయుడు రూ.40వేలు విరాళం అందజేశారు.కార్యక్రమంలో మూల సంఘం అధ్యక్షుడు శరగడం జగన్, ప్రసాద్, ఆడారి గోవింద, ఆదిశివ, రామాలయం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

యువకుల ఆమరణ నిరాహార దీక్ష


తహశీల్దారు కార్యాలయం ఎదురుగా దీక్ష చేపట్టిన యువకులు

ఎలమంచిలి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోని పెదపల్లి సమీపంలో చెరువు స్థలం అన్యాక్రాంతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం యువకులు తహశీల్దారు కార్యాలయం ఎదుట ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారు. ప్రభుత్వానికి చెందిన చెరువు స్థలం ఆక్రమణకు గురికాకుండా కాపాడాలని కోరుతూ పెదపల్లి, మంత్రిపాలెం, గొల్లపాలెం ప్రాంతాలకు చెందిన యువకులు నినాదాలు చేశారు. మూడు గ్రామాలకు చెందిన యువకులు, స్థానికులు పాల్గొన్నారు.

'ఆర్థిక లావాదేవీలపై అప్రమత్తంగా ఉండాలి'

అచ్యుతాపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బ్యాంకుల్లో జరిగే రోజువారీ లావాదేవీలపై అప్రమత్తంగా ఉండాలని సీఐ ఆర్‌వీఎస్ఎస్ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్‌లో అచ్యుతాపురంలో గల వివిధ బ్యాంకు మేనేజర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సెజ్ కర్మాగారాల్లో వివిధ రాష్ట్రాలకు చెందిన వారు విధులు నిర్వహిస్తున్నారని, వీరి బ్యాంక్ లావాదేవీలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అనుమానాస్పద ఖాతాల నుంచి బహుళ లావాదేవీలు జరిగితే గుర్తించి తమకు తెలియజేయాలన్నారు.

కోటవురట్లలో హిందూ సమ్మేళనం శోభాయాత్ర


శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

కోటవురట్ల, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గీత జయంతి పురస్కరించుకుని సోమవారం కోటవురట్ల మండల పరిషత్ కార్యాలయం నుంచి తంగేడు చెరకు కొనుగోలు కేంద్రం వరకూ హిందూ మహాసమ్మేళనం శోభాయాత్ర నిర్వహించారు. రాష్ట్ర హిందూ జన శక్తి అధ్యక్షుడు లలితాకుమార్, వందిలాది భక్తులు ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం హిందూ మహా సమ్మేళనం సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చత్రపతి శివాజీ హిందూ సేన వ్యవస్థాపకుడునక్క సత్యనారాయణ, తంగేడు సర్పంచ్ కోరుప్రోలు శివ, రాజుపేట సర్పంచ్ బోడ్డేటి వెంకటరమణ పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

పాయకరావుపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలని పట్టణ సీఐ జి.అప్పన్న అన్నారు. సోమవారం స్థానిక చిత్రమందిర్ సెంటర్‌లో ఆటో డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. ఆటో డ్రైవర్లు ప్రతి ఒక్కరూ యూనిఫారమ్ ధరించడంతోపాటు డ్రైవింగ్ లైసెన్స్, ఆటో సీ బుక్ ఇతర ధ్రువపత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. మైనర్లకు ఆటో ఇవ్వవద్దన్నారు. పరిమితికి మించి ప్రయాణిలను ఎక్కించుకోకూడదని, కార్యక్రమంలో పోలీసులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

కొండకర్లలో సీఎం రిలీఫ్ ఫండ్ పత్రాలు పంపిణీ

అచ్యుతాపురం రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండకర్ల గ్రామానికి చెందిన మేడపాటి సుధీర్ గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎంపీ పప్పల చలపతిరావు సిఫార్స్ మేరకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.44,850 మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన పత్రాలను టీడీపీ నేతలు లబ్ధిదారుని ఇంటికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు.

వరి రైతును వెంటాడుతున్న తుఫాన్లు

- వరి పంట చివరిలో దిత్వా తుఫాన్ ముప్పు
- ఆందోళన చెందుతున్న అన్నదాతలు


శ్రీరాంపురంలో కోతకు సిద్ధంగా ఉన్న వరి పైరు

పాయకరావుపేట రూరల్, డిసెంబరు1 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ మండల రైతాంగాన్ని భయపెడుతోంది. వరి పంట చేతికందే సమయంలో బంగాళాఖాతంలో ఏర్పడుతున్న వరుస అల్పపీడనాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో ప్రస్తుతం వరి పంట పండి కోతకు సిద్ధంగా ఉంది. ఈ సమయంలో దిత్వా తుఫాన్‌తో వర్షాలు కురిస్తే నష్టపోతామని అన్నదాతలు గుబులు చెందుతున్నారు. అక్టోబరు చివరి వారంలో మొంథా తీవ్ర తుఫాన్ గండం నుంచి గట్టెక్కడంతో ఊపిరి పీల్చుకున్న రైతన్నలు ఇప్పుడు మరల వరి పంట చివరి దశలో ఉన్న సమయంలో మరో తుఫాన్‌తో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖాధికారులు ప్రకటించడంతో రైతులు కలవరం చెందుతున్నారు. దిత్వా తుఫాన్ ప్రభావంతో ఆదివారం నుంచి వాతావరణంలో మార్పులు ఏర్పడ్డాయి. ఆదివారం రాత్రి జల్లులు పడ్డాయి. సోమవారం ఉదయం నుంచి ఆకాశం మేఘావృత్తమై ఉంది. మండలంలో సాగునీటి కాలువలు, బోర్లు కింద సుమారు 2,320 హెక్టార్లలో రైతులు వరిని సాగు చేస్తున్నారు. ఈ ఏడాది మండలంలో వర్షాలు ఆలస్యంగా కురవడంతో రైతులు వరినాట్లు కూడా ఆలస్యమయ్యాయి. ప్రస్తుతం వరి పంట కంకులు దశలో ఉన్నాయి. కొన్నిచోట్ల చేను కోత దశలో ఉంది. అక్కడక్కడ కోతలు ప్రారంభిస్తున్నారు. మొంథా తుఫాన్ సమయంలో మండలంలో వరి చేనులు పొట్టదశలో ఉండడం వలన ఎటువంటి నష్టం కలగలేదు. ప్రస్తుతం వర్షాలు, గాలులు వీస్తే వరి చేనులు నేలకొరిగి తీవ్రంగా నష్టపోయే అవకాశం ఉందని రైతులు భయపడుతున్నారు. ఈ ఏడాది వరి సాగుకు పెట్టుబడులు పెరిగాయి. ఎకరాకు రూ.20 వేలు నుంచి రూ.25 వేలు వరకు పెట్టుబడులు అయ్యాయి. ఈ సమయంలో తుఫాన్ వర్షాలు పడితే తీవ్రంగా నష్టపోతామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎన్టీఆర్ భరోసాతో పేదలకు వెలుగులు

- ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్


ఎలమంచిలిలో పెన్షన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

ఎలమంచిలి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):ఎన్టీఆర్ భరోసా పింఛన్లతో పేదల జీవితాల్లో వెలుగులు నింపాయని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. సోమవారం మునిసిపాలిటీ తులసీనగర్‌లో ఎమ్మెల్యే, టీడీపీ పట్టణ, మండల పార్టీ అధ్యక్షులు ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, గొర్లె నానాజీ ఇంటింటికి వెళ్లి పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయకుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు పథకాలు అమలు చేస్తుందన్నారు. అనంతరం మునిసిపాలిటీలోని రామారాయుడుపాలెం గ్రామానికి వెళ్లే కల్వర్టు నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. కార్యక్రమంలో కూటమి నేతలు బొద్దపు శ్రీను, ఏఎంసీ ఉపాధ్యక్షుడు గొర్లె బాబూరావు, కొఠారు రమేశ్‌నాయుడు, కొఠారు శ్రీను, కరణం రవి, ఊడి బాబులు, అందే రమణ, చిట్టిబాబు, కొఠారు నరేష్ పాల్గొన్నారు.

పాయకరావుపేటలో..

పట్టణంలోని 6,7 వార్డులలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పెదిరెడ్డి చిట్టిబాబు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు ప్రభుత్వం అందజేస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు పెదిరెడ్డి శ్రీను, నాయకులు వేములపూడి అప్పారావు పాల్గొన్నారు.

ఎస్.రాయవరంలో

మండలంలోని పెదగుమ్ములూరులో సోమవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను మాజీ ఎంపీపీ యేజెర్ల వినోద్‌రాజు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. గుడివాడ పంచాయతీలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు ఎస్.వెంకటరాజు, ధర్మవరం అగ్రహారంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి అల్లు నరసింహమూర్తి లబ్ధిదారులకు పెన్షన్లు అందజేశారు.

రాంబిల్లిలో..

మండలంలోని అన్ని పంచాయతీలలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌లను కూటమి నేతలు అధికారులతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. హరిపురంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ధూళి రంగనాయకులు, లోవపాలెంలో, నేవీ కాలనీల్లో రాంబిల్లి పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ ఎరిపల్లి చిట్టిబాబు, తెలుగుయువత మండల అధ్యక్షుడు ఎరిపల్లి అజయ్, జడ్ చింతువాలో చెల్లూరి ఆనంద్ పెన్షన్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాలకు చెందిన కూటమి నేతలు, అధికారులు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో..

గ్రామాల్లో పెన్షన్‌ల పంపిణీ సోమవారం ముమ్మరంగా సాగింది. ఖాజీపాలెంలో టీడీపీ మండల అధ్యక్షుడు పీలా తులసీరామ్ సోమవారం ఇంటింటికీ వెళ్లి పెన్షన్‌లు పంపిణీ చేశారు. అలాగే దొప్పెర్లలో ఎంపీటీసీ సభ్యుడు పల్లి వెంకటరావు, అచ్యుతాపురంలో టీడీపీ నాయకుడు కూనిశెట్టి రమణ, ఆవరాజాంలో సర్పంచ్ నానాజీ, హరిపాలెంలో కాండ్రేగుల వెంకట రమణ పెన్షన్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో కొల్లి వరహాలరావు, నందారపు గంగరాజు, మాణిక్యం, రండి బాబూరావు, కొల్లి వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

కోటవురట్లలో..

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అభ్యర్థులను మండల ప్రజలు గెలపించాలని టీడీపీ జిల్లా కార్యదర్శి లాలం కాశీనాయుడు పిలుపునిచ్చారు. సోమవారం కోటవురట్లలో పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్లు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు జానకిశ్రీనివాసరావు, ఎంపీడీవో సూర్యారావు, టీడీపీ నేత కసిరెడ్డి యేసు పాల్గొన్నారు.

53 ఏళ్లుగా భగవద్గీత పారాయణం

- నూకరాజును సత్కరించిన గ్రామస్థులు


బోధకుడు తేలి నూకరాజును సత్కరించిన పలువురు గ్రామస్థులు

మునగపాక, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):భగవద్గీత, రామాయణం వంటి గ్రంథాలను బోధించడంలో అతి తేలి నూకరాజు అపారమైన ప్రావీణ్యం సంపాదించారని జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామిసత్యనారాయణ అన్నారు. స్థానిక కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో సోమవారం భగవద్గీత పారాయణం ముగింపు, గీతాజయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఉచితంగా శిక్షణ కల్పించి వారిలో ఉచ్ఛరణ, ఆధ్యాత్మిక, సాంస్కృతిక విలువలు పెంచుతున్నారన్నారు. విశ్రాంతి ఉపాధ్యాయుడు పెంటకోట జగన్నాథంనాయుడు మాట్లాడుతూ ఆలయ ఆవరణలో 53 సంవత్సరాలుగా ఏటా 40 రోజులు పాటు భగవద్గీత, రామాయణం పారాయణం చేయడం గొప్ప విషయమన్నారు. అనంతరం పారాయణం బోధకుడు నూకరాజు దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దిమ్మల అప్పారావు, ఆడారి కాశిబాబు, ఆడారి శ్రీరామ్, పెంటకోట జోగినాయుడు, కాండ్రేగుల సంధ్య పాల్గొన్నారు.

ఇన్‌చార్జి ఎంపీపీ రాజాన శేషు బాధ్యతల స్వీకరణ


రాజాన శేషును అభినందిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

ఎలమంచిలి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):ఎలమంచిలి మండల పరిషత్ ఇన్‌చార్జి అధ్యక్షుడిగా రాజాన సూర్య చంద్ర శేషగిరిరావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీడీఓ కేఎస్. కొండలరావు సమక్షంలో పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, జనసేన పార్టీ ఉత్తరాంధ్ర ప్రతినిధి సుందరపు సతీష్ కుమార్‌తో పాటు పలువురు కూటమి నేతలు అభినందించారు. ఈ సందర్భంగా రాజాన శేషు మాట్లాడుతూ రాజకీయాలకతీతంగా మండలాన్ని అందరి సమన్వయంతో అభివృద్ధి చేస్తానన్నారు. అంతకుముందు ఆయన ఆయన స్వగ్రామం నుంచి తన అనుచరులతో ర్యాలీగా వచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నేతలు పిట్టా శ్రీను, దిన్‌బాబు, కాండ్రకోట చిరంజీవి, ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, గెంజి శ్రీను, కర్రి ఝాన్సీ, లవుడు లోవరాజు, రమేష్ నాయుడు, కొఠారు శ్రీను, రాజాన నారాయణమ్మ, చిట్టిబాబు, రామదాసు, తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలి


కోటవురట్లలో మావనహారం నిర్వహించిన వైద్యులు, సిబ్బంది, విద్యార్థులు

కోటవురట్ల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ వ్యాధి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మత్తుడాక్టర్ ఏజెఎన్ ప్రసాద్ తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణదినోత్సవం సందర్భంగా సోమవారం కోటవురట్లలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, హైస్కూల్ విద్యార్థులతో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం కోటవురట్ల జంక్షన్‌లో మానవహారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధి సోకిన వారు మానసికంగా ఆందోళన చెందవలసిన అవసం లేదన్నారు. ఐసీటీసీ కౌన్సిలర్ కృష్ణంరాజు హెచ్ఐవీ-ఎయిడ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కేవెంకటాపురంలో వైద్యఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ర్యాలీ నిర్వహించారు.

ఎలమంచిలిలో..

ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఎలమంచిలిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు కళాశాల నుంచి ఆర్టీసీ బస్టాండ్ జంక్షన్ వరకూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్. చంద్రశేఖర్ మాట్లాడుతూ యువత ఈ వ్యాధి పట్ల అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్విజ్, వ్యాసరచన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యకరమంలో ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ అర్జున అప్పారావు, డాక్టర్. వి. చిట్టిబాబు, పీడీ సతీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

పాయకరావుపేటలో బాలకృష్ణ అభిమానుల ర్యాలీ


పాయకరావుపేటలో జై బాలయ్య జెండాలతో ర్యాలీ నిర్వహిస్తున్న అభిమానులు

పాయకరావుపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఈనెల 5వ తేదీన విడుదలవుతున్న నందమూరి బాలకృష్ణ నటించిన అఖండ-2 చిత్రం ఘన విజయం సాధించాలని కోరుకుంటూ పట్టణంలో ఆయన అభిమానులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. తొలుత స్థానిక ఎల్‌టీ.కాలనీ శివాల యంలో నియోజకవర్గ నందమూరి కల్చరల్ యూత్ గౌరవాధ్యక్షులు చింత కాయల రాంబాబు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించిన అనంతరం చిత్రమందిర్ థియేటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో కల్చరల్ యూత్ అధ్యక్షుడు విశ్వనాధుని శ్రీను, అభిమానులు బత్తిన గోవిందు, జి.అచ్చిబాబు, లెక్కల గోవిందు, కుసనం శివాజీ, పందిరి చిన్నబ్బాయి, శ్రీరంగం వరాలు, పిల్లా దాస్, వెలుగుల సతీష్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా టీచర్ల ఆటల పోటీలు


వాలీబాల్ పోటీలో పాల్గొన్న టీచర్లు

నక్కపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి జడ్పీ హైస్కూల్‌లో ప్రాథమిక, ఉన్నత పాఠశాలలకు చెందిన మహిళా ఉపాధ్యాయులకు సోమవారం ఆటల పోటీలు నిర్వహించారు. ఎంపీడీవో బి. చైతన్య, హైస్కూల్ హెచ్ఎం పి.విజయ ఈ పోటీలను ప్రారంభించారు. ఎంఈవోలు కె.నరేశ్, నాగన్నదొర పాల్గొన్నారు.

అచ్యుతాపురంరూరల్‌లో..

హరిపాలెం ఉన్నత పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయులకు క్రికెట్ పోటీలను ఎంఈఓలు సీకే దేవరాయలు, రజని నిర్వహించారు. ఈ పోటీల్లో 40 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ఎంపికైన వారు ఈనెల 13, 14 తేదీల్లో జరగనున్న డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొంటారు.

'తమ్మయ్యపేటలో ఇళ్లను రీ సర్వే చేయాలి'

నక్కపల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని చందనాడ శివారు తమ్మయ్యపేటలో ఇండస్ట్రియల్ కారిడార్ కోసం భూములిచ్చిన రైతుల ఇళ్ల రీ సర్వే చేయాలని నిర్వాసిత రైతులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిర్వాసితులు ఆందోళన చేశారు. వారికి వైసీపీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు సంఘీబావం తెలిపారు. భూములిచ్చిన నిర్వాసితుల రైతుల ఇళ్లల్లో వివాహమైన ఆడపిల్లలకు ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ నర్సింహమూర్తికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు గంటా తిరుపతిరావు, తళ్లాభార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ కీలకమైనది : సీఐ

అచ్యుతాపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):జీవితంలో విద్యార్థి దశ చాలా కీలకమైనదని, ఈ దశ నుంచే చట్టాలపై అవగాహన అవసరమని సీఐ ఆర్‌వీఎస్ఎస్ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం స్థానిక ప్రైవేటు స్కూల్‌లో చట్టాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ ఒకరు ఉన్నత స్థానానికి ఎదగాలన్నా, జీవితం నాశనం అయినా నిర్ధారించేది విద్యార్థి దశేనన్నారు. విద్యార్థి తశలో తప్పటడుగులు వేస్తే జీవితాంతం బాధపడాల్సివస్తుందన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఈకార్యక్రమంలో ఎస్ఐ సుధాకర్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

'సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి'

అచ్యుతాపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రొంగలి రాము డిమాండ్ చేశారు. సోమవారం దోసూరు, తిమ్మరాజుపేటల్లో జరిగిన భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ బోర్డును వైసీపీ ప్రభుత్వం రద్దుచేసిందన్నారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే పునరుద్ధరిస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చినా నేటికీ అమలుచేయలేదన్నారు. ఈ సమావేశాల్లో రాజాన అప్పలనాయుడు, కె. సోమునాయుడు, పైడిరాజు, నాగేశ్వరరావు, బాబూరావు, ప్రభాకర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యం

- ఏఐసీసీ సంయుక్త కార్యదర్శి సుశాంత్ మిశ్రా


సుశాంత్ మిశ్రాకు మెమోంటోను అందజేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సంస్థాగతంగా కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడమే ప్రధాన లక్ష్యమని ఏఐసీసీ సంయుక్త కార్యదర్శి సుశాంత్ విశ్రా అన్నారు. సోమవారం ఇక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం దెబ్బ తీస్తోందని ఆరోపించారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడేది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనన్నారు. కార్యకర్తల వ్యక్తిగత అభిప్రాయాలను సేకరించి, వారి సూచనలకు అనుగుణంగా పార్టీని బలోపేతం చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి తనకాల అనంతరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడ సురేష్, డీసీసీ అధ్యక్షుడు మీసాల సుబ్బన్న, నాయకులు ఎంవీ రాహుల్, రావి రామసత్యం, దొడ్డి రవి, పెదపూడి రాము, నగుమంత్రి సాయి తదితరులు పాల్గొన్నారు.

7న రాష్ట్ర స్థాయి ఘంటసాల పాటల పోటీలు

ఎలమంచిలి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు 103వ జన్మదినాన్ని పురస్కరించుకుని ఎలమంచిలిలో ఈ నెల 7వ తేదీన రాష్ట్రస్థాయి పాటల పోటీలు నిర్వహిస్తున్నట్టు ఘంటసాల కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధులు ఆడారి పూరి జగన్నాథం, వనుం నాగేశ్వరరావు తెలిపారు. ఈ పోటీల్లో ఘంటసాలకు చెందిన పాటలు మాత్రమే పాడాలన్నారు. ఎలమంచిలిలోని ఘంటసాల కళామందిర్ ఆవరణలో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి పోటీలు ప్రారంభమవుతాయన్నారు. ఈ పోటీల్లో పాల్గొనేవారు 9868403081, 9704896996లను సంప్రదించాలన్నారు.

ఘనంగా 'గంటా' జన్మదిన వేడుకలు

నక్కపల్లి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు బర్త్ డే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కూటమి నాయకులు మీగడ సత్తిబాబు, కేవీ సత్యనారాయణ,పెదిరెడ్డి రమేష్, అల్లాడ తాతారావు, కొత్తశ్రీను, కోసూరి శ్రీను, పాము గణేశ్ తదితరులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఆస్పత్రుల్లో రోగులకు పాలు, రొట్టెలు పంపిణీ చేశారు.

భగవద్గీత పోటీల్లో సెయింట్ జూడ్స్ విద్యార్థుల ప్రతిభ

ఎలమంచిలి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):గీతా జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన భగవద్గీత పోటీల్లో ఎలమంచిలి సెయింట్ జూడ్స్ స్కూలు విద్యార్థులు ప్రతిభ కనబరచి బహుమతులు కైవసం చేసుకున్నారని హెచ్ఎం రిక్కీ తెలిపారు. కొత్తపేట రామాలయంలో మండల స్థాయి భగవద్గీత పోటీల్లో పి.హన్విక, కె.బావిన్, కె.సహస్ర, ఎస్.కార్తికేయ, కేఎస్ఎన్‌వి.తేజ, టి. సిరిచందన, ఎస్.మనస్విని, కుశాల్, డి.సాహిత్య బహుమతులు సాధించినట్టు తెలిపారు. విజేతలను న్యాయ సలహాదారు అడ్వకేట్ జస్‌బీర్, తెలుగు భాష నిపుణులు పి.ఉమ, ఉపాధ్యాయులు అభినందించారు.

భవన నిర్మాణ కార్మికుని కుటుంబానికి రూ.3.1లక్షల సాయం

పాయకరావుపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రమావశాత్తూ ఇటీవల మృతిచెందిన భవన నిర్మాణ కార్మికుని కుటుంబానికి రూ.3.1 లక్షల సాయాన్ని తుని, పాపయకరావుపేట తాపీమేస్త్రీల సంఘం అధ్యక్షుడు మజ్జూరి నారాయణరావు అందజేశారు. సోమవారం స్థానిక సంఘం కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో నక్కపల్లి మండలం చినరామభద్రపురం గ్రామానికి చెందిన అన్నం చిరంజీవి కుటుంబ సభ్యులకు రూ.3.1 లక్షల నగదును అందజేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కూండ్రపు చంటి, చందక శ్రీను, పంపనబోయిన చంటి, పులి ఎరకయ్య, మేడిశెట్టి కృష్ణ పాల్గొన్నారు.

సీఐటీయూ మహాసభల గోడపత్రిక ఆవిష్కరణ

రాంబిల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి):విశాఖపట్నంలో ఈనెల 31 నుంచి జనవరి 4వ తేదీ వరకు జరుగనున్న సీఐటీయూ అఖిల భారత మహాసభల గోడ పత్రికను సోమవారం ఇక్కడ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.దేముడునాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో తొలిసారిగా అఖిలభారత మహాసభలు జరుగుతున్నాయని, వీటిని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు చందక రామకష్ణ, ఎన్.నారాయణరావు, భవన నిర్మాణ సంఘం నాయకుడు ఎస్.రాంబాబు, కొబ్బరి ఒలుపు కార్మిక సంఘం నాయకుడు ముసలయ్య, సింహాచలం, ఆదిబాబు పలువురు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సాగుదారులకు పట్టాలు మంజూరు చేయాలి

కోటవురట్ల, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి):ఎన్నేళ్లుగా సాగు చేసుకుంటున్న ప్రభుత్వ భూములకు పట్టాలు మంజూరు చేయాలని కోటవురట్ల, రాట్నాపాలెం రైతులు ఆందోళన చేపట్టారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఎం మండల కన్వీనర్ జీ డేవిడ్ రాజు ఆధ్వర్యంలో సాగుదారులు ఆందోళన చేపట్టారు. అనంతరం సాగుదారులు తహశీల్దార్ తిరుమలబాబుకు వినతపత్రం అందజేశారు.

డీసీసీ అధ్యక్ష పదవికి జగతా శ్రీనివాస్ పోటీ

పాయకరావుపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి పోటీచేయనున్నట్టు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగతా శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడిగా ఎన్నో పదవుల్లో పనిచేశానన్నారు. తాను అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షుని పదవి కోసం ఏఐసీసీ అబ్జర్వర్ సుశాంత్‌మిశ్రాకి దరఖాస్తు అందజేశానన్నారు.

సామాజిక పరివర్తనతో ఎయిడ్స్ నిర్మూలన

▸▸ కలెక్టర్ విజయకృష్ణన్ వెల్లడి ▸▸ అంతర్జాతీయ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా వైద్య సిబ్బందితో కలిసి అనకాపల్లిలో ర్యాలీ

అనకాపల్లిటౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సామాజిక పరివర్తన ద్వారానే ఎయిడ్స్ వ్యాధిని నిర్మూలించవచ్చని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. అంతర్జాతీయ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా సోమవారం ఇక్కడి ఎన్టీఆర్ వైద్యాలయం నుంచి వైద్యాధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటైన అవగాహన ర్యాలీని ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆరోగ్య పరిరక్షణకు అంతా అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. మెయిన్ రోడ్డులోని ప్రధాన రహదారుల గుండా ర్యాలీ సాగింది. అనంతరం నెహ్రూచౌక్‌లో మానవహారంగా ఏర్పడి ఎయిడ్స్ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని, ఎయిడ్స్ పట్ల అవగాహన కలిగి ఉండాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఎంఅండ్ హెచ్‌వో డాక్టర్ ఎం.హైమావతి, డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాసరావు, వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావు, అభివృద్ధి కమిటీ సభ్యుడు ఆళ్ల రామచంద్రరావు, ఎయిడ్స్ కంట్రోల్ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, చిత్రంలో డీఎంహెచ్‌వో తదితరులు



సబ్బవరం ప్రధాన కూడలిలో ప్రతిజ్ఞ చేస్తున్న వివిధ శాఖల అధికారులు

సబ్బవరం : ఎయిడ్స్ నియంత్రణ అందరి బాధ్యత అని స్థానిక పీహెచ్‌సీ ప్రధాన వైద్యుడు డాక్టర్ చక్రవర్తి అన్నారు. అంతర్జాతీయ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా ఇక్కడ విద్యార్థులు, వైద్య సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులంతా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. సీఐ జి.రామచంద్రరావు మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపరాదన్నారు. అదే విధంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెడ్ రిబ్బన్, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ ఆశ, డాక్టర్ రాంబాబు, సీహెచ్‌వో స్వర్ణలత, ఐసీటీసీ కౌన్సిలర్ ఎస్.రాజశేఖర్, పీహెచ్ఎన్ సరస్వతి, హెచ్ఎస్ రాంబాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శంకర్, డాక్టర్ రత్నప్రకాశ్, డాక్టర్ సత్యనారాయణపాల్గొన్నారు.

శారదా నదిలో దెబ్బతిన్న గ్రోయిన్లను శాశ్వత ప్రాతిపదికన నిర్మించాలి

▸▸ వ్యవసాయదార్ల సంఘ సమావేశంలో సభ్యుల వినతి

▸▸ మునగపాక, అచ్యుతాపురం మండలాలను అనకాపల్లి రెవెన్యూ డివిజన్‌లో కొనసాగించాలని తీర్మానం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి దాడి వీరభద్రరావు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : శారదా నదిలో దెబ్బతిన్న గ్రోయిన్లను శాశ్వత ప్రాతిపదికన నిర్మించి, రైతాంగానికి సాగునీరు అందించాలని వ్యవసాయదార్ల సంఘం ప్రభుత్వాన్ని ఒక తీర్మానంలో కోరింది. సోమవారం ఇక్కడ జరిగిన వ్యవసాయదారుల సంఘ సమావేశంలో మాజీ మంత్రి, సంఘ అధ్యక్షుడు దాడి వీరభద్రరరావు మాట్లాడారు. గ్రోయిన్లు దెబ్బతినడం వల్ల రైతులకు సాగునీరందక 25 వేల ఎకరాలు పంట నష్టపోతున్నారని ఆయన పేర్కొన్నారు. అలాగే మునగపాక, అచ్యుతాపురం మండలాలను నక్కపల్లి రెవెన్యూ డివిజన్‌లో కాకుండా అనకాపల్లి డివిజన్‌లో కొనసాగించాలని మరో తీర్మానంలో ప్రభుత్వాన్ని కోరినట్లు ఆయన చెప్పారు. రైతు సంఘాలతో మార్కెటింగ్ శాఖ అధికారులు సంప్రదించి ఎన్టీఆర్ మార్కెట్ యార్డులో రైతు బజారు ఏర్పాటును పనులు చేపట్టాలన్నారు. మార్క్‌ఫెడ్ అధికారులు టమోటో, మొక్కజొన్న ఖరీదు చేసి రైతులు నష్టాలపాలు కాకుండా ఆదుకోవాలన్నారు. క్రాప్ ఇన్సూరెన్స్ చెల్లించడంలో కేంద్ర ప్రభుత్వం విధించిన అనేక నిబంధనలను సరళీకృతం చేయాలని, పంట పోయిన వారికి నష్టపరిహారం చెల్లించే విధానాన్ని అమలు చేయాలని విన్నవించారు. ఆక్రమణలకు గురవుతున్న పంట కాలువలను గుర్తించి సర్వే రాళ్లను ఏర్పాటు చేసి కాలువలకు రక్షణ కల్పించాలని జిల్లా కలెక్టర్‌ను మరో తీర్మానంలో కోరినట్టు చెప్పారు. ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలన్నారు. ఆక్రమణలకు గురవుతున్న తుమ్మపాల సుగర్స్ స్థలాలను కాపాడాలని కోరారు. అనంతరం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. అధ్యక్షులుగా దాడి వీరభద్రరావు, ఉపాధ్యక్షులుగా విల్లూరి పైడారావు, ఆళ్ల నూకేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా విల్లూరి రాము, కార్యదర్శులుగా విల్లూరి మాధవరావు, కర్రి మోదినాయుడు, కోశాధికారిగా కర్రి గుణతో పాటు 25 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో దాడి రత్నాకర్, కర్రి దివాకర్, కొణతాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి పారిశుధ్య కార్మికులు ధర్నా



జోనల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

అనకాపల్లిటౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జీవీఎంసీ జోనల్ కార్యాలయం వద్ద సోమవారం పారిశుధ్య కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షుడు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ జీవీఎంసీలో అనకాపల్లి విలీనానికి ముందు పారిశుధ్య కార్మికులు 450 మంది పని చేసేవారన్నారు. విలీనం తరువాత జోన్ విస్తరణ, జనాభా పెరిగిందన్నారు. అందుకు తగిన విధంగా కార్మికులను పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే, మృతులు, పదవీ విరమణ, దీర్ఘకాలిక సెలవుల ద్వారా ఖాళీ అయిన పోస్టులను వారి వారసులతో భర్తీ చేయాలన్నారు. పర్మినెంట్, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. అనంతరం జడ్సీ చక్రవర్తికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ కాళ్ల తేలయ్యబాబుతో పాటు పలువురు కార్మికులు పాల్గొన్నారు.

'గ్రంథాలయాలు విజ్ఞానానికి మూల కేంద్రాలు'



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యనారాయణరెడ్డి

అనకాపల్లిటౌన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఆధునిక యుగంలో సెల్‌ఫోన్లు, ఇంటర్నెట్ వినియోగం పెరిగినా గ్రంథాలయాలు నేటికీ విజ్ఞానానికి మూలకేంద్రాలుగా నిలుస్తాయని ప్రముఖ విద్యావేత్త, సాంస్కృతి గ్లోబెల్ స్కూల్ చైర్మన్ పీసపాటి సూర్యనారాయణరెడ్డి అన్నారు. స్థానిక గౌరీ గ్రంథాలయాన్ని సోమవారం ఆయన సందర్శించి పాఠకులను ఉద్దేశించి మాట్లాడారు. గ్రంథాలయాల సందర్శన అక్షరయజ్ఞంతో సమానమన్నారు. విద్యార్థులు, యువత మొబైల్ తెరల నుంచి బయటకు వచ్చి గ్రంథాలయాల్లో గంటలు గడపాల్సిన అవసరం ఉందన్నారు. గ్రంథాలయాలు కేవలం పుస్తకాలకు నిలయాలు మాత్రమే కాదని, సమాజ వికాసానికి మేధోమథనానికి వేదికలని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కార్యదర్శి కాండ్రేగు వెంకటరమణ, ఆర్టీఐ ఉద్యమకర్త సిహెచ్.గణేశ్వరరావు, సంస్కృతి గ్లోబల్ స్కూల్ సీఈవో కె.నిశాంత్ తదితరులు పాల్గొన్నారు.

తీడ, చెరకాం గ్రామాల్లో ఎన్ఎస్ఎస్ శిబిరం



ప్రత్యేక శిబిరంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కోరిబిల్లి రమేష్

కశింకోట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తీడ, చెరకాం గ్రామాల్లో అనకాపల్లి దాడి వీరునాయుడు కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు సోమవారం ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించారు. తొలుత ఈ శిబిరాన్ని ప్రిన్సిపాల్ కోరిబిల్లి రమేష్ ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలో అక్షరాస్యతను పెంచడంతో పాటు పరిసరాల పరిశుభ్రత, కాలుష్య నియంత్రణ తదితరాలపై విద్యార్థులు గ్రామస్థులకు అవగాహన కల్పిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఉషాకిరణ్, మాజీ సర్పంచ్ పి.దేముడు, ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి నాగేశ్వరరావు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు శ్మశానవాటిక సమస్య పరిష్కారం

సబ్బవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మలు నాయుడు పాలెంలో అపరిష్కృతంగా ఉన్న దళితుల శ్మశానవాటిక సమస్యను తహశీల్దార్ బి.చిన్నికృష్ణ సోమవారం పరిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు రేబాక మధుబాబు, జైభీమ్ సేన కార్యదర్శి దండు సూర్యనారాయణ మాట్లాడుతూ గ్రామంలో మూడు దశాబ్దాలుగా శ్మశానవాటిక సమస్య ఉందన్నారు. తహశీల్దార్ చిన్నికృష్ణ మండల, గ్రామ అధికారులు క్షేత్ర పరిశీలన చేసి సమస్యను పరిష్కరించారని వారు ఆనందం వ్యక్తం చేశారు.

ఊరూరా.. పింఛన్ల సందడి



పరవాడ మండలం కన్నూరులో వృద్ధురాలికి పింఛన్ నగదు అందిస్తున్న కలెక్టర్



మొగలిపురంలో పింఛన్ అందిస్తున్న గండి బాబ్జీ



అనకాపల్లి పట్టణం పూడిమడక రోడ్డులో బుద్ద పింఛన్ల పంపిణీ



దిబ్బవీధిలో వృద్ధురాలితో మాట్లాడుతున్న భీమరశెట్టి రామకృష్ణ

అనకాపల్లి టౌన్/పరవాడ/ లంకెలపాలెం/సబ్బవరం, డిసెంబర్ 1 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ ఊరూరా సోమవారం పండుగ వాతావరణంలో సాగింది. ఈ సందర్భంగా అధికారులు, ప్రజాప్రతినిధులు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు నేరుగా వెళ్లి నగదును చేతికి అందజేశారు. పరవాడ మండలం కన్నూరులో వృద్ధురాలితో పాటు దివ్యాంగుడికి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ పింఛన్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాలను అర్హులంతా సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బి.నాగరాజు, ఎంపీడీవో షేక్ బేగం, పంచాయతీ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు. అలాగే, అనకాపల్లి పట్టణంలోని 82వ వార్డు పరిధి పూడిమడక రోడ్డులో మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీశ్వరరావు, 81వ వార్డు నెయ్యిల వీధి, నిదానం దొడ్డి ప్రాంతాల్లో గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర, దిబ్బవీధిలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ), మారేడుపూడిలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, 84వ వార్డులో జీవీఎంసీ జోనల్ కమిషన్ కె.చక్రవర్తిలతో పాటు పలు వార్డుల్లో కూటమి నాయకులు పింఛన్లను పంపిణీ చేశారు. అలాగే, మండల కేంద్రం పరవాడలో టీడీపీ నాయకులు పింఛన్లు పంపిణీ చేశారు. పార్టీ మండల కార్యదర్శి పైలా చినఅక్కునాయుడు, సాంస్కృతిక విభాగం జిల్లా అధికార ప్రతినిధి పైలా రామచంద్రరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు వర్రి చంద్రశేఖర్, వీఆర్వో బొడ్డు శ్రీనివాసరావు, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

అదేవిధంగా సబ్బవరం మండలంలోని మొగలిపురంలో మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ పింఛన్ల పంపిణీని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ కూటమి ప్రభుత్వం నెరవేర్చుతున్నట్టు చెప్పారు. సామాజిక పింఛన్ల పంపిణీ ఉత్సాహభరిత వాతావరణంలో సాగుతున్నట్టు ఎంపీడీవో పి.పద్మజ తెలిపారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

▸▸ ఎన్టీపీసీ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) షణ్ముగ సుందరం

పరవాడ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అధికారులు సమన్వయంతో పని చేస్తూ ప్లాంట్ పురోభివృద్ధికి కృషి చేయాలని ఎన్టీపీసీ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) కె.షణ్ముగ సుందరం సూచించారు. సోమవారం ఆయన సింహాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్లాంట్‌లో జరుగుతున్న కార్యకలాపాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన స్థానిక దీపాంజలి నగర్‌లో గల జీవనరేఖ ఆస్పత్రి, షాపింగ్ కాంప్లెక్స్, పాఠశాల, క్లబ్‌లను సందర్శించారు. అలాగే ప్రధాన ప్లాంట్‌లోని కంట్రోల్ రూమ్, ఎఫ్‌జీడీ వ్యవస్థ గురించి సింహాద్రి ఈడీ సమీర్ శర్మ వివరించారు. అదేవిధంగా ప్లాంట్ పురోగతి, కార్యాచరణ పనితీరును తెలుసుకున్నారు. అధికారులకు డైరెక్టర్ ప్రాజెక్టు పలు సలహాలు, సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సింహాద్రి వివిధ విభాగాల జీఎంలు, ఏజీఎంలు, ఉద్యోగులు పాల్గొన్నారు.



సంస్థ అధికారులతో ఎన్టీపీసీ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) షణ్ముగ సుందరం

'మాదకద్రవ్యాల వాడకంతో జీవితాలు నాశనం'



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సీఐ అల్లు స్వామినాయుడు

కశింకోట, డిసెంబర్ 1 (ఆంధ్రజ్యోతి) : మాదకద్రవ్యాల వాడడం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులు పూర్తి అవగాహన చేసుకొని దూరంగా ఉండాలని సీఐ అల్లు స్వామినాయుడు, ఎస్ఐ మనోజ్‌కుమార్ సూచించారు. సోమవారం స్థానిక డీపీఎన్ హైస్కూల్‌లో మాదకద్రవ్యాలపై అవగాహన, శక్తియాప్ గురించి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రగ్స్ వాడకం వల్ల జీవితం నాశనమవడమే కాకుండా ఆరోగ్యం పూర్తిగా దెబ్బతింటుందన్నారు. అంతేగాకుండా సమాజంలో గౌరవం కూడా ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి

కశింకోట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ప్రజా కార్మిక సంఘాల నాయకుడు దాకారపు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. కశింకోట కూడలిలో సోమవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం సంక్షేమ బోర్డు నుంచి రావాల్సిన నిధులను దారి మళ్లించిందని ఆరోపించారు. కూటమి నాయకులు ఈ విషయంలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి డి.డి.వరలక్ష్మి, నాయకులు కొండబాబు, సత్యారావు, మహేష్, మల్లేష్, అప్పారావు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు

31 నుంచి సీఐటీయూ అఖిల భారత మహాసభలు

కశింకోట : సీఐటీయూ అఖిల భారత మహా సభల పోస్టర్‌ను మండలంలోని సోమవరం గ్రామంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు కార్మికులతో సమావేశం ఏర్పాటు చేశారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరిస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. ఈ నెల 31 నుంచి జనవరి నాలుగో తేదీ వరకు విశాఖపట్నంలో జరగనున్న సీఐటీయూ అఖిలభారత మహాసభలను విజయవంతం చేయాల్సిందిగా కోరారు. జిల్లా ఉపాధ్యక్షురాలు మజ్జి నాగేశు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు నాగరాజు, అప్పారావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

6న జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం

విశాఖపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సమావేశం ఈనెల ఆరో తేదీని నిర్వహించాలని మేయర్ పీలా శ్రీనివాసరావు నిర్ణయించారు. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కార్యదర్శి బీవీ రమణను ఆదేశించారు. ఇప్పటి వరకు 230 ప్రతిపాదనలు అజెండాలో చేర్చినట్టు తెలిసింది. శుక్రవారం వరకు ప్రతిపాదనలు స్వీకరించే అవకాశం ఉండడంతో అజెండాలో 300కిపైగా అంశాలుంటాయని భావిస్తున్నారు. కార్యదర్శి పేషీకి అందిన అంశాల్లో యోగాంధ్రకు సంబంధించిన పనులకు బిల్లు చెల్లింపు అంశాలే ఎక్కువగా ఉన్నట్టు తెలిసింది.

సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు పత్రాలు అందజేత



మహిళకు మంజూరు పత్రం అందిస్తున్న పీలా

తుమ్మపాల, డిసెంబర్ 1 (ఆంధ్రజ్యోతి) : పేదల ఆరోగ్య పరిరక్షణకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్టు మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ తెలిపారు. తుమ్మపాలలో సోమవారం పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు పత్రాలు అందజేసి మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు సమప్రాధాన్యం ఇస్తూ పాలన సాగిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డైట్‌లో 'కోడ్విటా' ల్యాబ్ ప్రారంభం



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న దాడి రత్నాకర్

అనకాపల్లిటౌన్, డిసెంబర్ 1 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం అత్యాధునిక, సాంకేతిక, మౌలిక వసతులతో కూడిన కోడ్విటా ల్యాబ్‌ను విద్యా సంస్థల చైర్మన్ దాడి రత్నాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక కోడింగ్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, డేటా ఇంజనీరింగ్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ వంటి రంగాల్లో విద్యార్థులు పరిశ్రమ అవసరాలకు సరిసమాన నైపుణ్యాలు పొందేలా ఈ ల్యాబ్‌ను ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే 'గంటా'కు టీడీపీ నేతల శుభాకాంక్షలు



ఎమ్మెల్యే గంటాకు పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న కశింకోట మండల టీడీపీ నాయకులు

కశింకోట, డిసెంబర్ 1 (ఆంధ్రజ్యోతి) : భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు జన్మదిన వేడుకలను ఇక్కడి టీడీపీ నాయకులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. పార్టీ మండల అధ్యక్షుడు గొంతిన శ్రీనివాసరావు, నాయకులు నైనంశెట్టి రమణారావు తదితరులు విశాఖలోని గంటా నివాసానికి వెళ్లి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.



కొత్తకోటలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాజు

సమర్థ పాలన చంద్రబాబుకే సాధ్యం

▸ చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

రావికమతం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని సమర్థవంతంగా పరిపాలించే సత్తా చంద్రబాబునాయుడుకే సాధ్యమని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు పేర్కొన్నారు. సోమవారం కొత్తకోటలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో భాగంగా సూపర్ సిక్స్ పథకాల అమలుతో పాటు ఊహించని ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు అందిస్తున్నారన్నారు. ఇప్పటికే కొట్నాబిల్లి రింగ్ రోడ్డు పనులు దాదాపు పూర్తయ్యాయని, త్వరలోనే బీఎన్ రోడ్డు నిర్మాణం చేపడతామని చెప్పారు. అలాగే బీఎన్ రోడ్డు పరిధిలో కూలిపోయిన విజయరామరాజు, వడ్డాది వంతెనల నిర్మాణానికి త్వరలోనే టెండర్లు ఖరారు కానున్నాయన్నారు. ఆర్ఈసీ రోడ్డు అభివృద్ధికి సీఎం చంద్రబాబు, ఆర్అండ్‌బీ శాఖ మంత్రి, ఉన్నతాధికారులను కలసి రూ.12.5 కోట్లు మంజూరు చేయించినట్టు ఎమ్మెల్యే చెప్పారు. ఈ నిధులతో రావికమతం నుంచి గుడివ వరకు రోడ్డు నిర్మాణం జరుగుతున్నదన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహేశ్, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ రాజాన కొండనాయుడు, తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు కె.నీలవేణి, టీడీపీ సీనియర్ నేత కోట గోవిందరావు పాల్గొన్నారు.

ప్రజలతో మమేకమై పనిచేయండి: డీఎస్పీ



మహిళా కానిస్టేబుల్‌కు రివార్డు అందిస్తున్న నర్సీపట్నం డీఎస్పీ శ్రీనివాసరావు

నాతవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): పోలీసులు ప్రజలతో మరింత మమేకమై పనిచేయాలని నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాసరావు సూచించారు. నర్సీపట్నం రూరల్ సీఐ రేవతమ్మతో కలిసి నాతవరం పోలీసు స్టేషన్‌ను ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా పోలీసు స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. అనంతరం విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన మహిళా కానిస్టేబుల్ రాజేశ్వరికి రివార్డును అందజేశారు. పోలీసు స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని సూచించారు. అలాగే గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వై.తారకేశ్వరరావు పాల్గొన్నారు.

గంటాకు కూటమి నేతల శుభాకాంక్షలు



గంటాకు జ్ఞాపిక అందిస్తున్న చోడవరం జనసేన, టీడీపీ నాయకులు

చోడవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): భీమిలి ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు జన్మదిన వేడుకల్లో కూటమి నాయకులు పాల్గొని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చోడవరానికి చెందిన జనసేన జిల్లా కార్యదర్శి సిరిపురపు రమేశ్, పీఏసీఎస్ చైర్మన్ గూనూరు మూలినాయుడు, జనసేన పట్టణ అధ్యక్షుడు కర్రి రమేశ్, పార్టీ నేత బొబ్బిలి నాయుడు, లక్కవరం, జన్నవరం టీడీపీ నాయకులు సేనాపతి శ్రీనివాసరావు, ఎస్.నరసింహమూర్తి పాల్గొన్నారు.

టీడీపీని మరింత బలోపేతం చేయాలి



మండల నాయకులతో చర్చిస్తున్న పార్టీ పరిశీలకుడు చిట్టిబాబు

నాతవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో టీడీపీని మరింత బలోపేతం చేయాలని పార్టీ పరిశీలకులు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పెద్దిరెడ్ల చిట్టిబాబు కోరారు. డి.యర్రవరంలో పార్టీ మండల అధ్యక్షుడు నందిపల్లి వెంకటరమణ, తాండవ చైర్మన్ కరక సత్యనారాయణలతో కలిసి నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా గత ఎన్నికల్లో టీడీపీకి ఓట్లు తక్కువ వచ్చిన బూత్‌లపై చర్చించారు. ఆయా ప్రాంతాల్లో పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ పల్లా విజయ్‌కుమార్, డి.యర్రవరం సర్పంచ్ సత్యవతి పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సోషల్ ఆడిట్



నాగాపురంలో ఉపాధి పనులపై సోషల్ ఆడిట్ చేస్తున్న అధికారులు

కృష్ణాదేవిపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలంలోని సిహెచ్.నాగాపురం గ్రామంలో ఉపాధి పథకంపై సోమవారం సోషల్ ఆడిట్ చేశారు. పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ ప్రజల సమక్షంలో వివిధ పనులపై గ్రామసభ నిర్వహించారు. వ్యయాలు, లబ్ధిదారుల వివరాలు, బిల్లులు, మస్టర్లు తదితర అంశాలను అధికారులు పరిశీలించారు. ప్రభుత్వం మంజూరు చేస్తున్న నిధులు నిజమైన లబ్ధిదారులకు చేరాలని ఈ సందర్భంగా సర్పంచ్ వైఆర్.చంద్రరావు కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ టీసీ సిహెచ్.రాధిక, కార్యదర్శి అశోక్, మాజీ సర్పంచ్ కొలగాని రామారావు, టీడీపీ నాయకులు బొప్పన ప్రసాద్, వరహాలుబాబు తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేల శిబిరంపై పోలీసుల దాడి

బుచ్చెయ్యపేట, డిసెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిబ్బిడి గ్రామంలో సోమవారం కోడి పందేల శిబిరంపై పోలీసులు మెరుపు దాడి చేశారు. ఈ దాడుల్లో పది మంది కోడి పందెం రాయుళ్లు పట్టుబడ్డారు. వారి నుంచి 5,040 నగదు, మూడు కోళ్లు, తొమ్మిది ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని, పందెంరాయుళ్లను అరెస్టు చేశామని ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

రైతుల మేలు కోసం ప్రభుత్వం కృషి

మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

ఒమ్మలిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

మాడుగుల రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రైతులకు మేలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణ మూర్తి అన్నారు. మండలంలోని ఒమ్మలి రైతు సేవా కేంద్రంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళారుల చేతుల్లో రైతులు మోసపోకుండా సరైన గిట్టుబాటు ధర కల్పించేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ కేంద్రాల ద్వారా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి, సకాలంలో వారి బ్యాంకు ఖాతాల్లో సొమ్ము జమ చేస్తారన్నారు. గ్రేడ్-ఎ రకానికి క్వింటాకు రూ.2389, సాధారణ రకానికి రూ.2369 ధర నిర్ణయించారని ఆయన చెప్పారు. రైతులకు వెన్నుదన్నుగా ఉండేందుకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, సర్పంచ్ సింహాచలంనాయుడు, టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు నందారపు సన్యాసిరావు, రమేశ్, నాయకులు ఉండూరు దేముడు, పెంటకోట జగన్నాథరావు, చారుమతిదేవి, ఏవో అనసూయ, వ్యవసాయ సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

చంద్రబాబుకు రాష్ట్ర అభివృద్ధే ప్రధానం

కె.కోటపాడు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధే ప్రధాన ధ్యేయంగా సీఎం చంద్రబాబు పనిచేస్తున్నారని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. సూరెడ్డిపాలెం గ్రామంలో సోమవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రాష్ట్రాన్ని దారుణంగా లూటీ చేసి వందేళ్లు వెనక్కి తీసుకువెళ్లిందన్నారు. వైకాపా నాయకులు దోపిడీలు, దౌర్జన్యం, అవినీతి ప్రధాన అస్త్రాలుగా పరిపాలన చేశారన్నారు. ప్రస్తుతం చంద్రబాబు పాలనపై అన్ని వర్గాల వారు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. గ్రామాల్లో కార్యకర్తలు ఎప్పటికప్పుడు రచ్చబండలు వద్ద ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై చర్చించాల్సిన అవసరం ఉందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని పని చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సాంబశివరావు, తహశీల్దార్ భుజంగరావు, రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ చైర్మన్ ఈవీజీ కుమార్, టీడీపీ మండల అధ్యక్షుడు రొంగలి మహేశ్, నాయకులు ఈర్లె మల్లు నాయుడు, గంగునాయుడు, బాబ్జి, ఎరుకునాయుడు, డి.నరసింహమూర్తి, పి.శ్రీను, సిహెచ్.రామారావు, జె.రాము, కె.సూర్యనారాయణ, అప్పలనాయుడు, కె.అంజిబాబు, నారాయణమూర్తి, శ్రీను పాల్గొన్నారు.



సూరెడ్డిపాలెంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు, పక్కన పీవీజీ కుమార్

పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

మునిసిపల్ కౌన్సిలర్ పద్మావతి... ఉత్సాహంగా పింఛన్ల పంపిణీ

నర్సీపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని 26వ వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి అన్నారు. సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఉత్సాహంగా పంపిణీ చేశారు. నర్సీపట్నంలో కౌన్సిలర్ పద్మావతి గడప గడపకు వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు కృషి ఫలితంగా మునిసిపాలిటీలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో నూకాలమ్మ ఆలయ కమిటీ ప్రతినిధులు కొరుప్రోలు శ్రీనివాసరావు, బాల పాల్గొన్నారు.



నర్సీపట్నంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ పద్మావతి

మాకవరపాలెంలో...

మాకవరపాలెం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చామంతిపురం, శెట్టిపాలెం గ్రామాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్‌వై.పాత్రుడు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు అల్లు రామునాయుడు సోమవారం పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులందరికీ పింఛన్ అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలు ఆర్.రమణమ్మ, నాయకులు అప్పలరాజు, శివ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండలో...

గొలుగొండ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో పింఛన్లు పంపిణీ చేశారు. నూతనంగా తొమ్మిది పింఛన్లు మంజూరైనట్టు ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. గుండుపాలలో టీడీపీ మండల అధ్యక్షుడు చిటికెల తారక వేణుగోపాల్ పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పింఛన్ల మంజూరులో ముందుంటుందన్నారు.

రోలుగుంటలో...

రోలుగుంట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని పంచాయతీల్లో పింఛన్ల పంపిణీని ఉత్సాహంగా నిర్వహించారు. రోలుగుంటలో ఎంపీడీవో నాగేశ్వరరావు పాల్గొని పంపిణీ చేశారు. మొదటి రోజే 90 శాతం మేర పంపిణీ పూర్తి చేసినట్టు ఆయన తెలిపారు. లబ్ధిదారులకు సేవలను మరింత వేగంగా, పారదర్శకంగా అందించేందుకు సిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు.

బుచ్చెయ్యపేటలో...

బుచ్చెయ్యపేట, డిసెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): మండలానికి 15 కొత్త పింఛన్లు మంజూరయ్యాయని ఎంపీడీవో శివప్రసాద్ నారాయణరావు తెలిపారు. సోమవారం నీలకంఠపురంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ ఏశారు. డిసెంబర్ నెలకు 10532 మంది లబ్ధిదారులకు రూ.4.6 కోట్లు విడుదలయ్యాయని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. సోమవారం మధ్యాహ్నం వరకు 95 శాతం మందికి పింఛన్లు అందించామన్నారు. ఈ నెల మండలానికి 15 స్పౌజ్ పింఛన్లు, మాత్రపిండాల వ్యాధిగ్రస్థులకు పింఛన్లు మంజూరయ్యాయని ఆయన చెప్పారు.

మాడుగుల రూరల్...

మాడుగుల రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొంగలిపాక గ్రామంలో పీఏసీఎస్ అధ్యక్షులు ఉండూరు దేముడు, నాయని సత్యనారాయణ, కూటమి నాయకులు సోమవారం పింఛన్లు పంపిణీ చేశారు. అర్హులందరికీ పింఛన్ల పంపిణీ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు గురించి వారు వివరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, సచివాలయం ఉద్యోగులు, నాయకులు నాయుడు, సత్యం, పోతురాజు, తదితరులు పాల్గొన్నారు.

పెద్దేరు జలాశయం నుంచి 300 క్యూసెక్కుల నీరు విడుదల

మాడుగుల రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దేరు జలాశయం జలాశయంలో నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరింది. తుఫాన్ వర్షాలకు వరదనీరు వచ్చి చేరడంతో నీటి నిల్వలు పెరిగాయి. గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు కాగా, సోమవారం సాయంత్రానికి 136.25 మీటర్లకు చేరింది. ఇన్‌ఫ్లో 125 క్యూసెక్కులు వస్తున్నదని జలాశయం ఏఈ సుధాకర్‌రెడ్డి తెలిపారు. దీంతో సోమవారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో జలాశయం మూడో నంబరు గేటు తెరిచి 300 క్యూసెక్కుల నీటిని నదీ ప్రవాహంలోకి విడిచి పెట్టినట్టు ఆయన తెలిపారు.

పాఠశాలల్లో సామాజిక తనిఖీలు

చోడవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, నాణ్యమైన విద్యా బోధనకు అనుసరిస్తున్న విధానాలపై సోమవారం సామాజిక తనిఖీలు నిర్వహించారు. కొత్తూరు బాలికల హైస్కూల్‌లో ఎంఈవోలు ఎం.పాండురంగారావు, కె.సింహాచలం తల్లిదండ్రుల కమిటీ సమక్షంలో తనిఖీలు చేశారు. పాఠశాలలో వసతులు, తరగతి గదులు, వంట షెడ్లు, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్వహణ, పరిశుభ్రత తదితర అంశాలను పరిశీలించి యాప్‌లో నమోదు చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఐవీ.రామిరెడ్డి, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ గుమ్మాల సత్య, సీఆర్‌పీ కేవీఎం నాయుడు పాల్గొన్నారు.

ఎస్ఐగా రుషికేశ్వరరావు బాధ్యతలు



బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ రుషికేశ్వరరావు

కృష్ణాదేవిపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కృష్ణాదేవిపేట ఎస్ఐగా రుషికేశ్వరరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ వై.తారకేశ్వరరావు రెండు నెలల క్రితం నాతవరం స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి ఈ పోస్టు ఖాళీగా ఉంది. ఎట్టకేలకు అల్లూరి సీతారామరాజు జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ నుంచి బదిలీపై రుషికేశ్వరరావును నియమించారు. మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, సిబ్బంది, ప్రజలు సహకరించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.

యూత్ హాస్టల్ అడ్‌హాక్ యూనిట్ ప్రారంభం

నర్సీపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): యూత్ హాస్టల్ అడ్హాక్ నర్సీపట్నం యూనిట్‌ను సోమవారం ప్రారంభించారు. బలిఘట్టంలోని లయన్స్ క్లబ్ కార్యాలయంలో రాష్ట్ర యూత్ హాస్టల్ చైర్మన్ చీమల రవి కుమార్, వైస్ ప్రెసిడెంట్ జగపతిరాజు, కార్యదర్శి ఎండీ ఇబ్రహీం, కోశాధికారి ఇ.శ్రీనివాసరావు, లయన్స్ క్లబ్ పూర్వపు అధ్యక్షుడు దస్త్రాల రాఘవేంద్రరావు ఆధ్వర్యంలో యూనిట్‌ను ప్రారంభించారు. నర్సీపట్నం యూనిట్ కన్వీనర్లుగా పాలపర్తి సత్యానందం, డాక్టర్ అధికార గోపాలరావు, పందల శివ, కాపరపు శివప్రసాద్, కె.సోమిరెడ్డి ఎంపికయ్యారు. క్లబ్ సభ్యులు ఎం.రఘురాం, బాబూరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తడిసిన వరి పనలకు రక్షణ చర్యలు చేపట్టాలి

చీడికాడ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ వర్షాలకు తడిసిన వరిని కాపాడుకునేందుకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయాధికారిణి ఎ.కృష్ణవేణి సూచించారు. మండల కేంద్రం చీడికాడతో పాటు పలు గ్రామాల్లో తడిసిన వరిపనలను రైతులతో కలిసి ఆమె పరిశీలించారు. ఐదు శాతం ఉప్పు ద్రావణం తడిసిన పనలపై పిచికారీ చేయాలని సూచించారు. ఇప్పటికే కళ్లాలకు తెచ్చిన వరి పనలు నూర్చితే, ఆ ధాన్యం వర్షానికి తడవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రెండు, మూడు రోజుల పాటు వరి కోతలను రైతులు వాయిదా వేసుకోవాలని ఆయన కోరారు.

మట్టి తవ్వకాలను నిలిపివేయాలి

దేవరాపల్లి, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మట్టి తవ్వకాలను వెంటనే నిలుపుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డి.వెంకన్న కోరారు. ఈ మేరకు సోమవారం తహశీల్దార్ లక్ష్మీదేవిని కలిసి వినతిపత్రం అందశారు. సామాన్య రైతు పొలం, కల్లానికి మట్టి తరిలిస్తే వాహనాలు సీజ్ చేసే అధికారులు, జిరాయితీ భూముల్లో మట్టికి అనుమతులు ఇచ్చామంటూ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మండల కంద్రంలో మట్టి తవ్వకాలను వెంటనే నిలుపుదల చేయాలని ఆయన కోరారు.

వంద రోజుల పని వినియోగంపై అవగాహన సదస్సు

గొలుగొండ, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో వంద రోజుల పని వినియోగించుకోవడంపై సోమవారం కూలీలకు అవగాహన సదస్సు నిర్వహించారు. సోషల్ ఆడిట్‌లో భాగంగా పలు గ్రామాల్లో సభలు ఏర్పాటు చేశారు. గొలుగొండ, గుండుపాల గ్రామాల్లో నిర్వహించిన సభల్లో డీఆర్‌పీ రమణబాబు మాట్లాడుతూ కూలీలు వంద రోజుల పని దినాల్లో తప్పనిసరిగా పాల్గొనాలని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ అప్పారావు, టీడీపీ నేత రమేశ్, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీలు

చోడవరం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై సోమవారం అవగాహన ర్యాలీలు చేశారు. అలాగే నాలుగు రోడ్ల కూడళ్లలో మానవహారాలు నిర్వహించారు. చోడవరం ప్రభుత్వ కమ్యూనిటీ ఆసుపత్రి ఐసీటీసీ కేంద్రం ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎయిడ్స్‌పై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేలకు ఎమ్మెల్యే బహుమతులు అందించారు. అనంతరం కొత్తూరు జంక్షన్ వరకూ ర్యాలీగా వెళ్లి, అక్కడ మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ దినేశ్‌కుమార్, అభివృద్ధి కమిటీ చైర్మన్ దేవరపల్లి వెంకట అప్పారావు, సర్పంచ్ నూకరత్నం, టీడీపీ నాయకులు సకురు కోటేశ్వరరావు, మల్లిబాబు, డాక్టర్లు నాగభూషణం, విష్ణుప్రియ, రవికుమార్, ఐసీటీసీ కౌన్సెలర్ ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రావికమతం: మండలంలోని కొత్తకోట పీహెచ్‌సీ వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాధికి నివారణ ఒకటే మార్గమని ఈ సందర్భంగా డాక్టర్ సురేఖ చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి పి.రామారావు, హెచ్‌వి ఎర్రయ్యమ్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రోలుగుంట: స్థానిక జూనియర్ కళాశాల విద్యార్థులు నినాదాలతో ర్యాలీ చేశారు. హెచ్ఐవీ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బాధితులకు అందిస్తున్న వైద్య సేవలను వారు వివరించారు. అనంతరం బీఎన్ రోడ్డుపై మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అప్పలరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మాడుగుల: స్థానిక డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం, రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో ఎయిడ్స్ నివారణ దినోత్సవం నిర్వహించారు. యువత ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని డాక్టర్ నాయుడు సూచించారు. అనంతరం బస్టాండ్ ఆవరణలో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. కార్యక్రయంలో కళాశాల ప్రిన్సిపాల్ సీవీఎస్ఎస్ శాస్త్రి, జి.జయలక్ష్మి, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



కె.కోటపాడు ప్రధాన కూడలిలో మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు



చోడవరంలో ర్యాలీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

కె.కోటపాడు: అయ్యన్న డిగ్రీ, వివేకానంద జూనియర్ కళాశాల విద్యార్థులు హెచ్ఐవీపై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని డాక్టర్ శ్రీలక్ష్మి ప్రారంభించారు. ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉంటే వ్యాధులకు దూరంగా ఉండవచ్చని ఈ సందర్భంగా డాక్టర్ శ్రీలక్ష్మి చెప్పారు. అనంతరం కె.కోటపాడు పుర వీధులలో ర్యాలీ, మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యులు కోటేశ్వరరావు, సంతోశ్‌కుమార్, విజయలక్ష్మి, రమ, వైదేహి, రోజారాణి పాల్గొన్నారు.

కృష్ణాదేవిపేట: కృష్ణాదేవిపేటలో హెచ్ఐవీపై సోమవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఎయిడ్స్‌కు నివారణ తప్పితే మందులేదని వైద్యాధికారులు ఎస్.గాయత్రి, జ్యోతి చెప్పారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది మహాలక్ష్మి, ప్రసన్న, సత్యనారాయణ, చిట్టిబాబు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గొలుగొండ: ఎయిడ్స్ మహమ్మారిని అవగాహనతోనే తరుముదామని పీహెచ్‌సీ వైద్యాధికారి శ్యామ్‌కుమార్ అన్నారు. గొలుగొండలో హెచ్ఐవీపై సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. హెచ్ఐవీ బాధితులు భయాందోళన చెందాల్సిన పనిలేదని ఆయన చెప్పారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తుఫాన్ జల్లులతో రైతుల ఆందోళన

పలు మండలాల్లో నీట మునిగిన వరి పనలు

రావికమతం/రోలుగుంట/మాడుగుల రూరల్/చీడికాడ/గొలుగొండ/కృష్ణాదేవిపేట, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ రైతులను వణికించింది. తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షం జల్లులకు ఆరుగాలంగా శ్రమించిన పంట చేతికందే సమయంలో నీటి పాలవుతుందేమోనని వారు ఆందోళన చెందుతున్నారు. రావికమతం మండలంలోని ఖరీఫ్ సాగుగా ఈ ఏడాది మూడు వేల హెక్టార్లకు పైగా వరి పంటను సాగు చేశారు. ఇప్పటికే పండిన వరిని 30 శాతం కోసి రైతులు కుప్పలుగా పెట్టారు. మరో 150 ఎకరాలలో వరిని కోత కోయక తప్పని పరిస్థితిలో రైతులు రెండు రోజులుగా మడుల్లోనే ఆరవేశారు. ఈ తరుణంలో దిత్వా తుఫాన్ ప్రభావంతో ఆదివారం రాత్రి పడిన వర్షంతోపాటు సోమవారం మధ్యాహ్నం వరకు పడ్డ చిరు జల్లులకు వరి పనలు తడిచిపోయాయి. అలాగే గొలుగొండ మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ఉదయం చిరుజల్లులు పడ్డాయి. తుఫాను కారణంగా వర్షాలు పడుతున్నట్టు వాతావరణ శాఖ ప్రకటించడంతో వరిపంటల చేతికి అందే సమయంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. కృష్ణాదేవిపేట, ఏఎల్.పురం, చీడిగుమ్మల, గుండుపాల, పాతమల్లంపేట, అమ్మపేట, కొత్తమల్లంపేట, పాకలపాడు, ఏటిగైరంపేట గ్రామాల్లో వరి పంట కోత దశలో ఉంది. కొన్ని చోట్ల కోసిన వరి పనలు పొలాల్లోనే ఉన్నాయి. వర్షం జల్లులకు పొలాల్లో నీరు చేరి వరి పనలు దెబ్బతింటాయని రైతులకు దిగాలు పడ్డారు.

రోలుగుంట మండలంలో తుఫాన్ ప్రభావంతో ఆదివారం రాత్రి కుసిరిన వర్షానికి పలు గ్రామాల్లో కోత కోసిన వరి పొలాలు తడిసిపోయాయి. రోలుగుంటలో పంట కోత దశకు వచ్చిన పొలాలను పలువురు రైతులు రెండు రోజుల క్రితం కోత కోశారు. కోసిన వరి పనలను పొలాల్లోనే వదిలేశారు. తుఫాన్ ప్రభావంతో వర్షం పడింది. దీంతో కోసిన వరి పొలాలు తడిసిపోయాయి. రోలుగుంట నుంచి కొండపాలెం రహదారి పక్కన వరి పొలాల్లోని పనలు వర్షానికి తడిసిపోయాయి.



చీడికాడలోని ఓ పొలంలో వర్షానికి తడిసిన వరి పనలు

మాడుగుల సోమవారం వేకువజాము నుంచే మండలంలో తేలికపాటి జల్లులు పడ్డాయ. కొంత సమయం తరువాత విరామం ఇచ్చి మరళా మధ్యాహ్నం వర్షం మొదలైంది. తరువాత మబ్బు వాతావరణమే నెలకొంది. తుఫాన్ కారణంగా పెద్ద వర్షాలు కురుస్తాయేమోనని, చేతికందే వరి పంటకు నష్టం వాటిల్లుతుందేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. చీడికాడ మండలంలోని అన్ని గ్రామాల్లోను ఓ మోస్తరు వర్షం కురవడంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. ముందుగా నాట్లు వేసిన రైతులు పొలాల్లో వరిచేను గింజలు రాలుతున్నాయి. మూడు రోజుల ముందు అక్కడక్కడ కోతలు కోసి పొలాల్లో ఆరడానికి ఉంచారు. తుఫాన్ వర్షానికి పొలాల్లో నీరు చేరి వరి పనలు తడిచిపోతున్నాయని రైతులు వాపోయారు.

ఆమె బోధన వినూత్నం

- పిల్లలను ఆకట్టుకునే రీతిలో పాఠాలు
- వీడియోలు, చార్టుల రూపకల్పన
- సామాజిక మాధ్యమాల్లో లక్షల మంది వీక్షకులు
- పినగాడి ప్రాథమిక పాఠశాల ఎస్జీటీకి మంత్రి లోకేశ్ అభినందన

విశాఖపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): **సంప్రదాయ విధానంలో బోధన కంటే పిల్లలకు అర్థమయ్యేందుకు వినూత్న తరహాలో పాఠాలు చెబుతూ విద్యార్థులను ఆకట్టుకుంటున్నారు ఉపాధ్యాయురాలు పల్డాసింగి అలివేలి. ఈ క్రమంలో అందరి మన్ననలు పొందుతున్నారు. సామాజిక మాధ్యమాల్లో లక్షల వీక్షకులను సంపాదించుకున్న ఆమె, పిల్లల కోసం ఇంతవరకు 110 వీడియోలు రూపొందించారు. వాటిని వీక్షించిన మానవ వనరుల అభివృద్ధిశాఖా మంత్రి నారా లోకేశ్ అలివేలి కృషిని ప్రశంసిస్తూ ఎక్స్‌లో పోస్టు చేశారు.**

పెందుర్తి మండలం పినగాడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పల్డాసింగి అలివేలు పనిచేస్తున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలుకు చెందిన ఆమె 2014 డీఎస్సీలో ఎంపికై 2016లో ఎస్జీటీగా పెదబయలు మండలం బాసులలో సుమారు ఎనిమిదేళ్లు పనిచేశారు. మండల కేంద్రానికి 25 కి.మీ. దూరంలో ఉన్న బాసులకు వెళ్లాలంటే సుమారు ఆరేడు కిలోమీటర్లు కాలినడకన అడవిలో ప్రయాణించాలి. అయినప్పటికీ వెరవక ప్రతిరోజూ పాఠశాలకు వెళ్లి ఉత్తమ బోధనతో తల్లిదండ్రుల మన్ననలు పొందారు. టీచర్ల బదిలీల్లో భాగంగా 2023లో పెందుర్తి మండలం పినగాడి ప్రాథమిక పాఠశాలకు వచ్చారు.

నగరానికి ఆనుకుని ఉన్న పినగాడిలో చాలామంది తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపేందుకు మక్కువ చూపుతున్నారుఈ పరిస్థితులలో పిల్లలకు రొటీన్‌గా పాఠాలు బోధిస్తే ఫలితం ఉండదని గుర్తించిన అలివేలి, వినూత్న విధానానికి శ్రీకారం చుట్టారు. సబ్జెక్టు కంటే పిల్లలు ఇష్టపడేలా రైమ్స్, పాటలు, నృత్యాలు, బొమ్మలతో ఆమె బోధన ప్రారంభించారు. పిల్లలకు అర్థమయ్యేలా, లాజికల్‌గా, వివరణాత్మకంగా బోధిస్తున్నారు. వాటిపై వీడియోలు రూపొందించారు. ప్రధానోపాధ్యాయుడు, పిల్లలను భాగస్వాములను చేశారు. రెండోతరగతి చదివే ఆయిషాతో ఫోర్ బుల్లెట్ పేరుతో వీడియోలు రూపొందించారు. దీనికి మంచి స్పందన వచ్చింది. మిస్ యూనిక్ పేరుతో ఇన్‌స్టాగ్రామ్‌లో అప్‌లోడ్ చేశారు. ఈ వీడియోకు 1.65 లక్షల మంది వీక్షకులున్నారు. లక్షలలో లైక్‌లు వచ్చా యి. ఇలా 110 వీడియోలు రూపొందించారు. వీటినితిలకించిన మంత్రి లోకేశ్ ఎక్స్ వేదికగా స్పందించి, అలివేలి ప్రతిభను అభినందించారు. ఆటపాటలతో విద్యాబుద్ధులు నేర్పుతున్న తీరు చాలా బాగుంది. లెర్నింగ్ మేడ్ ఈజీ విత్ యాక్టివిటీస్ విధానం పిల్లల్లో చదువుపై ఆసక్తి కనబర్చుతుంది. యూనిక్ ఇన్నోవేటివ్ టీచింగ్ మెథడ్స్, నో బ్యాగ్ డే యాక్టివిటీ, వర్డ్ బిల్డింగ్, ఎఫ్ఎల్ఎన్ ఆధారిత బోధనతో పాఠాలు బోధిస్తూనే సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేస్తున్న అలివేలి కృషి ప్రశంసనీయమని లోకేశ్ ఎక్స్‌లో పేర్కొన్నారు.



విద్యార్థులతో ఉపాధ్యాయిని అలివేలి



పాఠ్యాంశాల చిత్రాలతో విద్యార్థినులు

పిల్లల్లో సృజనాత్మకతకు దోహదం



సెల్‌ఫోన్‌లు, టీవీలు వచ్చిన తరువాత పిల్లల ఆలోచనలు మారాయి. రొటీన్‌గా పాఠాలు బోధించడం కంటే కొత్తదనంతో చెబితే వారిలో సృజనాత్మకత వెలుగులోకి వస్తుందని భావించాను. పెదబయలులో ఉండగా కొంతవరకు అమలుచేశా. పినగాడి వచ్చిన తరువాత ప్రైవేటు పాఠశాలల పోటీ తట్టుకునేందుకు వినూత్న బోధనకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నా. తల్లిదండ్రులకు విషయం చెబుతూ పిల్లల్లో మానసిక వికాసం, చదువుపై ఆసక్తి పెరుగుతుందని ఫీడ్‌బ్యాక్ తీసుకుంటున్నాం. విద్యాశాఖ రూపొందించిన సిలబస్‌నే కొత్తగా బోధిస్తున్నాం. మంత్రి లోకేశ్ అభినందించడం ఉత్సాహాన్ని ఇచ్చింది. ప్రధానోపాధ్యాయుడు, విద్యాశాఖాధికారులు, గ్రామస్థుల ప్రోత్సాహంతో వినూత్న రీతిలో బోధిస్తున్నా.

\- పల్డాసింగి అలివేలి, ఎస్జీటీ, పినగాడి ప్రాథమిక పాఠశాల

క్రైం... crime news

ముగ్గురి ప్రాణాలు నిలిపిన మహోన్నతుడు

- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చెట్టుపల్లికి చెందిన రాజు మృతి
- పెద్ద మనస్సుతో అవయవాలను దానం చేసిన కుటుంబ సభ్యులు



మేడిశెట్టి రాజు (ఫైల్)

నర్సీపట్నం అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఇంటి పెద్ద చనిపోయినా తన అవయవాల ద్వారా మరో ముగ్గురి ప్రాణాలు నిలిపి ఆదర్శంగా నిలిచారు ఆ కుటుంబ సభ్యులు. ఇందుకు సంబంధించిన వివరాలివి. నర్సీపట్నం మండలం చెట్టుపల్లి గ్రామానికి చెందిన మేడిశెట్టి రాజుకు తీవ్ర అనారోగ్యం కావడంతో కుటుంబ సభ్యులు ఆదివారం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తీసుకు వెళ్లారు. వైద్యులు విశాఖ కిమ్స్ ఆస్పత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ అదే రోజు బ్రెయిన్ డెడ్‌కు గురయ్యారు. ఇతనికి భార్య వరలక్ష్మి, కుమార్తె ఉన్నారు. అయితే కుటుంబ సభ్యులు ఇతని అవయవాలను దానం చేయడానికి ముందుకు వచ్చారు. అదే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ పేషెంట్‌కు లివర్ అమర్చారు. తిరుపతిలో చికిత్స పొందుతున్న ఒకరికి గుండె, ఇంకొకరికి ఊపిరితిత్తులను గ్రీన్ చానల్ ఏర్పాటు చేసి పంపించారు.

పేకాట ఆడుతున్న ఎనిమిది మంది అరెస్టు

బుచ్చెయ్యపేట, డిసెంబరు 1 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని రాజాం గ్రామంలో పేకాట శిబిరంపై పోలీసులు సోమవారం దాడి చేశారు. ముందస్తు సమాచారం మేరకు ఎస్ఐ శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి వెళ్లారు. ఈ సందర్భంగా ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి 3,660 నగదును స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు.

మొర్రిగుడ పాఠశాలలో తనిఖీ

- మధ్యాహ్న భోజనం అమలు తీరును పరిశీలించిన డీఈవో



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈవో బ్రహ్మాజీరావు

డుంబ్రిగుడ, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని మొర్రిగుడ ఎంపీయూపీ పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు సోమవారం తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు పట్టికను పరిశీలించారు. నిర్మాణ దశలో ఉన్న పాఠశాల భవనాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో సుందరరావు, ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

విత్తన శుద్ధి చేయకే మానిపండు తెగులు



కొమిరలో మానిపండు తెగులు సోకిన వరి పొలాన్ని పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం

- కేవీకే ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ రాజ్‌కుమార్ వెల్లడి
- శాస్త్రవేత్తల బృందంతో కలిసి పలు గ్రామాల్లో పంట పొలాలు పరిశీలన
- రైతులకు సూచనలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

రావికమతం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : విత్తన శుద్ధి చేయకపోవడంతో పాటు సొంత విత్తనం వల్ల మానిపండు తెగులు ఆశించే అవకాశం ఉందని కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.రాజ్‌కుమార్ అన్నారు. 'మానిపండు తెగులుతో కలవరం' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' సోమవారం కథనాన్ని ప్రచురించింది. దీనిపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించారు. ఈ మేరకు వ్యవసాయశాఖ నర్సీపట్నం డివిజన్ ఏడీ శ్రీదేవితో పాటు కేవీకే ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ రాజ్‌కుమార్, శాస్త్రవేత్త డాక్టర్ సౌజన్యలు రైతులతో కలిసి మానిపండు తెగులు సోకిన కొమిర, మత్స్యపురం, చినపాచిల గ్రామాల్లోని వరి పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విత్తన శుద్ధి చేయక పోవడం వల్లనే ఈ తెగులు ఆశించిందని రైతులకు తెలిపారు. ముందుగా ఈ తెగులు సోకిన వరి కంకులను త్వరితగతిన తొలగించాలన్నారు. లేనిపక్షంలో గాలికి ఈ బూడిద ఎగిరి పక్క వాటికి వ్యాపించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

ఈ తెగులు సోకిన వరిని విత్తనంగా కట్టకూడదన్నారు. రైతులు సొంతంగా విత్తనం తయారు చేసేటప్పుడు సుడోమోనాస్, కార్బెన్‌డిజమ్ మందును విత్తనంలో కలిపి శుద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ తెగులు నివారణకు పురుగు మందులు కొట్టినా ఫలితం ఉండదన్నారు. మానిపండు తెగులు ఆశించకుండా అడుగు పొట్ట దశలో వరి ఉన్నప్పుడే ప్రోపికోనజల్ మందును లీటరు నీటిలో రెండు ఎంఎల్ చొప్పున కలిపి ఎకరానికి 200 ఎంఎల్ మందును సాయంత్రం సమయంలో పిచికారీ చేసుకుంటే ఈ తెగులు సోకదని వివరించారు. లేదా కార్బెన్‌డిజమ్ + మేన్కోజబ్ మందు లీటరు నీటకి రెండు గ్రాముల చొప్పున కలిపి ఎకరానికి 200 గ్రాములు ఈనే దశలో పిచికారీ చేసుకుంటే ఈ తెగులు సోకదని స్పష్టం చేశారు. అలాగే వరిలో రెక్కరాల్చు పురుగు ఉన్నందున దీని నివారణకు క్లోరీఫైరీఫస్ మందు లీటరు నీటిలో 2.5 ఎంఎల్ చొప్పున ఎకరానికి 500 ఎంఎల్ మందు పిచికారీ చేసుకోవాలన్నారు. లేకుంటే ప్రిప్రోసిల్ మందు లీటరు నీటికి రెండు ఎంఎల్ చొప్పున ఎకరానికి 400 ఎంఎల్ మందు పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రమేశ్‌బాబు, ఎంపీఈవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంపై దృష్టి

అధికారులకు కలెక్టర్ ఆదేశం



అర్జీదారునితో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్



ఫిర్యాదీతో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి కలెక్టరేట్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌కు వచ్చే అర్జీల పరిష్కారంపై దృష్టి పెట్టాలని అధికారులను కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. డీఆర్‌వో వై.సత్యనారాయణరావుతో కలిసి ఆమె ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వివిధ శాఖలకు సంబంధించి 276 అర్జీలు అందాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ అర్జీ నమోదు చేయాలన్నారు. ప్రజలు అందించిన అర్జీలను సంబంధిత శాఖలు పరిష్కార దిశగా తీసుకుంటున్న చర్యలను నిరంతరం ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలన్నారు. పీజీఆర్ఎస్‌కు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తుందని, అప్రమత్తంగా ఉండాలన్నారు. అర్జీదారులతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

నిర్ణీత గడువులోగా అర్జీల పరిష్కారం

- ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి రూరల్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్‌లో అందిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో ఆయన పాల్గొని అర్జీదారుల నుంచి 70 వినతులు స్వీకరించారు. అర్జీదారులతో నేరుగా ఆయన మాట్లాడి వారి గోడును ఆలకించారు. సమస్యల పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులకు బదలాయించారు. భూవివాదాలు, మోసాలు, కుటుంబ కలహాలు వంటి సమస్యలపై వినతులు అందినట్టు ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ ఎల్.మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు ఖోఖో జట్ల ఎంపిక



జాతీయ ఖోఖో పోటీలకు ఎంపికైన బాలుర జట్టుతో డీఈవో గిడ్డి అప్పారావునాయుడు, తదితరులు



ఎంపికైన బాలికల జట్టు

లంకెలపాలెం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో అండర్ - 14 బాలుర, బాలికల జాతీయ స్థాయి ఖోఖో జట్లను లంకెలపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆదివారం రాత్రి ఎంపిక చేశారు. మూడు రోజులు పాటు ఇక్కడ జరిగిన రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొని ప్రతిభ కనబరిచిన సంగతి తెలిసిందే. ఈ పోటీల్లో విశేషంగా రాణించిన క్రీడాకారులను ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ నెలాఖరులో రాజస్థాన్‌లో జరిగే జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో ఏపీ నుంచి రెండు జట్లు పాల్గొంటాయని ఎస్‌జీఎఫ్ ప్రతినిధులు తెలిపారు. కాగా ఎంపికైన క్రీడాకారులను జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావునాయుడు, కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్‌లు అభినందించారు. ఈకార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి కేఎం నాయుడు, హెచ్‌ఎం రౌతు నాగేశ్వరరావు, ఎస్‌జీఎఫ్ మాజీ కార్యదర్శి ఎంవీ. నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు ఎంపికైన బాలుర జట్టు

జె.హర్షవర్ధన్(విశాఖపట్నం), జి.మనోహర్‌నాయుడు(విశాఖపట్నం), టి.సూర్యనారాయణ(చిత్తూరు), ఎస్.బద్రీనాథ్(చిత్తూరు), టి.శృతి సాయి కీర్తన్(విశాఖపట్నం), ఎం.శ్రీకాంత్(గుంటూరు), సి.నగేశ్(కర్నూల్), కె.వెంకటసాయి(ప్రకాశం), ఎ.భూపతిరెడ్డి(తూర్పు గోదావరి), బి.కార్తీక్(శ్రీకాకుళం), ఎస్.రామ్‌చరణ్(కడప), కె.చరణ్(విశాఖపట్నం).

బాలికల జట్టు

ఆర్.స్వతిక(విశాఖపట్నం), ఆర్.లలితాదేవి(విశాఖపట్నం), ఎం.యువశ్రీ (చిత్తూరు), పి.జయశ్రీ(చిత్తూరు), ఎన్.అర్చనారెడ్డి(చిత్తూరు), జి.చందన(శ్రీకాకుళం), కె.పావని(విజయనగరం), టి.సింధు(ప్రకాశం.), ఎన్.బంధవిక(కృష్ణా), జి.అనుపమ(కడప), ఆర్.వీణ(అనంతపురం), టి.ప్రియ(తూర్పుగోదావరి).

నేవీ డే లేనట్టే!

- ఈసారి సాహస విన్యాసాలకు దూరం
- ఫిబ్రవరిలో ఐఎఫ్ఆర్, మిలాన్‌ల నేపథ్యంలో రద్దు

విశాఖపట్నం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి): నేవీ డే సందర్భంగా తూర్పు నౌకాదళం ప్రతి ఏటా డిసెంబరు 4వ తేదీ సాయంత్రం రామకృష్ణా బీచ్‌లో నిర్వహించే సాహస విన్యాసాల ప్రదర్శన ఈ ఏడాది కనిపించే అవకాశం లేదు. దీనికి సంబంధించి ఇప్పటికే ఏర్పాట్లు, రిహార్సల్స్ పూర్తయ్యేవి. విశాఖ గగన వీధుల్లో యుద్ధ విమానాలు చక్కర్లు కొట్టాల్సిన సమయం. కానీ ఈసారి వాటి జాడ లేదు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 15 నుంచి 25 వరకు విశాఖపట్నంలో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ, మిలాన్-2026ను భారీఎత్తున నిర్వహించడానికి నేవీ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. భారత రాష్ట్రపతి, ప్రధాని, ముఖ్యమంత్రి, తదితర ప్రముఖులు హాజరవుతారు. ఇందులో సుమారు 50 దేశాలకు పైగా పాల్గొంటాయి. ఇవి అతి పెద్ద కార్యక్రమాలు కావడం, అప్పుడు కూడా ఆర్కే బీచ్‌లో నేవీ సాహస విన్యాసాలు నిర్వహించాల్సి ఉండడంతో తాజాగా నేవీ డే నిర్వహించడం లేదని తెలిసింది. గత ఏడాది ఒడిశాలోని పూరి తీరంలో నేవీ డే నిర్వహించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆ తరువాత జనవరి 4న విశాఖలో ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, సతీమణి భువనేశ్వరి, మనవడు దేవాన్ష్‌తో కలిసి హాజరయ్యారు.

బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షునిగా కిల్లాడ



ఓబీసీ మోర్చా జిల్లా నాయకులకు నియామక పత్రం అందజేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు పరమేశ్వరరావు

కొత్తూరు, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ ఓబీసీ మోర్చా అనకాపల్లి జిల్లా అధ్యక్షునిగా కిల్లాడ వెంకట సత్యనారాయణ నియామకమయ్యారు. ఈ మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు జిల్లా నాయకుల జాబితాను సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ప్రకటించారు. జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షునిగా శరగడం వరాహ వెంకట శంకరరావు, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలిగా ఓరుగంటి నాగమణి, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షునిగా గోటివాడ స్మార్ట్‌కుమార్, జిల్లా మైనార్టీ మోర్చా అధ్యక్షునిగా షేక్ బాబాజీలను నియమించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు బొడ్డేడ నాగేశ్వరరావు, రత్నభరత్, ఉపాధ్యక్షుడు పలకా రవి తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు ముగ్గురి ఎంపిక



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినీ విద్యార్థులు

మాకవరపాలెం, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు మాకవరపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి ముగ్గురు ఎంపికయ్యారు. ఇటీవల నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో జరిగిన 69వ రాష్ట్రస్థాయి స్కూల్ బేస్‌బాల్ టోర్నమెంటులో జిల్లా బాలుర జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. ఇందులో ప్రతిభ చూపిన మాకవరపాలెం హైస్కూల్‌కు చెందిన ఎస్.తులసీరాజ్, జి.రాజేశ్, బాలికల విభాగం నుంచి సిహెచ్.భువనేశ్వరి అద్భుత ప్రతిభ చూపడంతో జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం నారాయణరావు తెలిపారు. వీరు జనవరిలో ఢిల్లీలో జరగనున్న పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. ఈ సందర్భంగా వీరిని సోమవారం ఆయనతో పాటు ఉపాధ్యాయులు, ఎస్ఎంఎస్ చైర్మన్ మాధవి తదితరులు అభినందించారు.

రాష్ట్రంలో ప్రతిష్ఠాత్మకంగా పింఛన్ల పంపిణీ

- స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం అర్బన్, డిసెంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం సమ ప్రాధాన్యం ఇస్తున్నట్టు శాసన సభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. మండలంలోని అమలాపురం గ్రామంలో సోమవారం పలువురి ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక పింఛన్ల పంపిణీని ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందన్నారు. ఇందులో భాగంగానే ప్రతి నెలా ఒకటో తేదీన సూర్యోదయానికి ముందే లబ్ధిదారులకు పింఛన్ నగదును అందిస్తున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వీవీ రమణ, జడ్పీటీసీ సుకల రమణమ్మ, వేములపూడి ఎంపీటీసీ-1 బోళెం రామ్‌ప్రసాద్, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజాన వీర సూర్యచంద్ర, టీడీపీ మండల అధ్యక్షుడు సుకల అప్పలనాయుడు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు లాలం శ్రీరంగ స్వామి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అన్నదాత వర్రీ

... 5వ పేజీ తరువాయి

కోటవురట్ల, నాతవరం మండలాల్లో ఆకాశం మేఘావృతమైంది. గొలుగొండ మండలంలో సుమారు 50 ఎకరాల్లో వరి పనలు తడిసిపోయాయి. వర్షం మరింత పెరిగితే పనలు నీటమునిగి, ధాన్యం మొలకెత్తి రంగు మారుతుందని రైతులు ఆవేదనతో చెబుతున్నారు. తుఫాన్ బలహీనపడినప్పటికీ రాగల 48 గంటల్లో ఈదురుగాలులతో వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ చేసిన ప్రకటనతో వరి రైతుల కంటిమీద కునుకు లేదు. ఈదురు గాలులు వీచి, భారీ వర్షాలు కురిస్తే పంట నేలవాలి, గింజ మొలకెత్తే ప్రమాదం వుంది.

శత శాతం ధ్యేయం

... 5వ పేజీ తరువాయి

అమలుచేస్తారు. అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో నిరక్ష్యరాస్యులకు ఇప్పటికే తరగతులు ప్రారంభమయ్యాయి. త్వరలో విశాఖ జిల్లాలోనూ నిర్వహిస్తామని జిల్లా వయోజన విద్యా ఉప సంచాలకుడు ఎస్.సుబ్రహ్మణ్యం తెలిపారు. అల్లూరి, అనకాపల్లి జిల్లాల్లో నిరక్షరాస్యులకు వచ్చే ఏడాది మార్చిలో పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

ప్రతి ఒక్కరికీ చదవడం, రాయడం, చిన్నపాటి కూడికలు, తీసివేతలు, సంతకం నేర్పుతున్నామన్నారు. ఒక వాచకం కూడా అందజేశామన్నారు.

'నర్సీపట్నం' అభివృద్ధికి ఏటా రూ.100 కోట్లు

... 5వ పేజీ తరువాయి

తెలిపారు. అభివృద్ధి, సంక్షేమానికి ప్రభుత్వం సమాన ప్రాధాన్యం ఇస్తున్నదని, పనిచేస్తున్న ప్రభుత్వాన్ని ప్రజలు ఆదరించాలని కోరారు. అంతకుముందు గ్రామంలో పలువురి ఇళ్లకు వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్ డబ్బులను లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ఆర్డీవో వీవీ రమణ, తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ, టీడీపీ నాయకులు నందిపల్లి వెంకటరమణ, ఎస్.విజయ్‌కుమార్, వెలగా వెంకటకృష్ణారావు, ఇనపసప్పల సత్యవతి, చింతంరెడ్డి బెన్నయ్యనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	110.00
లైవ్ ధర	130.00
విత్ స్కిన్	230.00
స్కిన్ లెస్	240.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	630
విజయనగరం	634
శ్రీకాకుళం	634